B9 NEWS
నిజం - మా ఇజం

మన.. ప్రజాపక్షం
ప్రతి అక్షరం ప్రజల కోసం...



PUBLISHED FROM:
Telangana & Andhrapradesh

సంపుటి : 01 | సంచిక : 242 | బుధవారం | 16-09-2026 | ఎడిటర్ : పులిజ్వాల చంద్రకాంత్ | పేజీలు : 08 | వెల : 05/-



నక్కా సుశీల రాణి లొంగుబాటు

- మావోయిస్టు డివిజన్ కమిటీ సభ్యురాలు నక్కా సుశీల రాణి లొంగుబాటు
- నిజామాబాద్ సీపీ ముందు లొంగిపోయిన నక్కా సుశీల
- తెలంగాణలో మావోయిస్టులు పూర్తిగా దెబ్బతిన్నారన్న పోలీసు అధికారులు 2
- మరో ముగ్గురు తెలంగాణ నేతలే అజ్ఞాతంలో ఉన్నారని వెల్లడి

మన ప్రజాపక్షం,నిజామాబాద్

దశాబ్దాలుగా వామపక్ష తీవ్రవాదంలో అత్యంత కీలక పాత్ర పోషించిన సీనియర్ నాయకురాలు, డివిజన్ కమిటీ సభ్యురాలు నక్కా సుశీల రాణి (అలియాస్ లత/లలిత/రేలా/జ్యోతి) లొంగిపోయారు. నిజామాబాద్ సీపీ సాయిచైతన్య ఎదుట ఆమె మంగళవారం అధికారికంగా లొంగిపోయారు. సుశీల సరెండర్‌తో మావోయిస్టుల పునర్నిర్మాణ సామర్థ్యం పూర్తిగా దెబ్బతిన్నదని, ఇది రాష్ట్రంలో వామపక్ష తీవ్రవాద పతనానికి ముగింపు దశగా నిలిచిందని పోలీసులు అభివర్ణించారు. ఈ చారిత్రాత్మక పరిణామంతో 2026 సంవత్సరం తెలంగాణ పోలీసు శాఖ పోరాటంలో ఒక కీలక మలుపుగా మారింది. స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్రాంచ్ (ఎ×డీ), గ్రేహౌండ్స్, జిల్లా పోలీసుల



చర్చించేందుకు సిద్ధం?

మన ప్రజాపక్షం,హైదరాబాద్

22-ఏ నిషేధిత భూముల జాబితాపై తెలంగాణ ప్రభుత్వం కీలక కసరత్తు చేస్తోంది. రేపు అసెంబ్లీలో 22-ఏ భూముల అంశంపై సభ్యులు లేవనెత్తిన ప్రశ్నలకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమాధానం ఇవ్వనున్నందున సీఎం పలువురు మంత్రులతో ఉన్నతస్థాయి సమావేశం నిర్వహించారు. హైదరాబాద్ ఎంసీహెచ్‌ఆర్డీ క్యాంపు కార్యాలయంలో జరుగుతున్న ఈ సమావేశానికి డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతో పాటు మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, వివేక్ వెంకటస్వామి హాజరయ్యారు. 22-ఏ జాబితాలో ఉన్న భూముల విషయంలో ప్రజలు, భూ యజమానులు ఎదుర్కొంటున్న సమస్యలపై సమావేశంలో ప్రధానంగా చర్చించినట్లు తెలుస్తోంది. నిషేధిత జాబితాలో ఉన్న భూములను పరిశీలించి అర్హమైన భూములను జాబితా నుంచి తొలగించడం, సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపించే మార్గాలపై మంత్రులతో సీఎం చర్చించినట్లు సమాచారం. అదేవిధంగా భూముల రిజిస్ట్రేషన్ల విషయంలో ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా ప్రభుత్వం తీసుకోవాల్సిన చర్యలపైనా సమాలోచనలు చేసినట్లు సమాచారం.నేడు అసెంబ్లీ చర్చలో ప్రభుత్వం స్పష్టమైన విధానాన్ని వెల్లడించేలా ఇప్పటికే వివిధ శాఖల నుంచి అందిన సమాచారం, 22-ఏ భూములకు సంబంధించిన వివరాలను సీఎం రేవంత్‌రెడ్డి పరిశీలించారు. మంత్రుల నుంచి సలహాలు, సూచనలు తీసుకుంటూ అసెంబ్లీలో ఇవ్వాల్సిన సమాధానంపై తుది కసరత్తు చేస్తున్నట్లు తెలుస్తోంది. మొత్తం మీద 2

- 22-ఏ నిషేధిత భూముల జాబితాపై ప్రభుత్వం కసరత్తు
- నేడు అసెంబ్లీలో చర్చించేందుకు సిద్ధం
- మంగళవారం సాయంత్రం అందుబాటులో ఉన్న మంత్రులతో సీఎం రేవంత్ రెడ్డి సమావేశం
- అసెంబ్లీలో కొనసాగనున్న చర్చలో 22ఏపై స్పష్టత ఇచ్చేందుకు సీఎం సిద్ధమైనట్లు సమాచారం



దాడి చేశారు

- నా పీఆర్ఓ, పీపపై 15 మంది గూండాలు దాడి చేశారు: కేటీఆర్ 2
- సైఫాబాద్ పోలీస్ స్టేషన్ లో ముసుగులు ధరించిన వ్యక్తులు దాడికి పాల్పడ్డారన్న కేటీఆర్
- పీఎస్ బయట, లోపల ఉన్న సీసీటీవీ ఫుటేజీని భద్రపరచాలని డిమాండ్
- రేవంత్ పాలనతో తెలంగాణ రౌడీ రాజ్యంలా మారిందని మండిపాటు


మన ప్రజాపక్షం,హైదరాబాద్

హైదరాబాద్ లోని సైఫాబాద్ పోలీస్ స్టేషన్ ప్రాంగణంలో తన పీఆర్ఓ మహేశ్ మాణిక్య, పీఏ మహేందర్ రెడ్డిపై దాడి చేశారంటూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపడ్డారు. యూనిఫాంలో ఉన్న పోలీసు అధికారుల సమక్షంలోనే ముసుగులు ధరించిన 15 మంది గుండాలు లోపలికి చొరబడి పక్కా ప్రణాళికతో ఈ దాడికి పాల్పడ్డారని... రాష్ట్రంలో లా అండ్ ఆర్డర్ వైఫల్యానికి ఇది నిదర్శనమని అన్నారు. ముఖ్యమంత్రి, హోంమంత్రిగా ఉన్న రేవంత్ రెడ్డి పాలనలో తెలంగాణ రౌడీ రాజ్యంలా మారిందని, అణచివేతకు తలొగ్గని ప్రతీ పౌరుడికీ భవిష్యత్తులో ఇలాంటి పరిస్థితులే ఎదురవుతాయని ఆందోళన వ్యక్తం చేశారు.అసెంబ్లీ గేటు ఘటనకు సంబంధించి హైకోర్టు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చి ఉన్నప్పటికీ, రాజకీయ కక్షసాధింపు చర్యల్లో భాగంగానే విచారణ పేరుతో ఉదయాన్నే స్టేషన్‌కు

ఎర్రవల్లి పసుపు నీళ్లే వివాదం..

నిందితులను అరెస్ట్ చేయొద్దన్న హైకోర్టు

- ఎర్రవల్లి కేసులో నిందితుల అరెస్టుపై హైకోర్టు బ్రేక్
- నిందితులకు నోటీసులు ఇచ్చి దర్యాప్తు చేయాలని ఆదేశం
- ఏడేళ్లలోపు శిక్ష వర్తించే కేసులపై పోలీసులను నిలదీసిన కోర్టు
- సుప్రీంకోర్టు మార్గదర్శకాలు పాటించాలని స్పష్టీకరణ
- అరెస్టులపై పోలీసుల తీరును తప్పుబట్టిన హైకోర్టు



మన ప్రజాపక్షం,హైదరాబాద్

ఎర్రవల్లి పసుపు నీళ్ల వివాదంలో తెలంగాణ ప్రభుత్వానికి హైకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. ఈ కేసులో నిందితులను వెంటనే అరెస్టు చేయొద్దని ధర్మాసనం ఆదేశించింది. కేవలం నోటీసులు ఇచ్చి దర్యాప్తు




గ్యారెంటీ పథకాలు సక్సెస్

- ట్రంప్ కూడా మా కాంగ్రెస్ హామీలనే కాపీ కొడుతున్నారు: డీకే శివకుమార్
- తమ ప్రభుత్వ గ్యారెంటీ పథకాలు సక్సెస్ అయ్యాయన్న డీకే శివకుమార్
- కర్ణాటక మోడల్ ను రాజస్థాన్, బీహార్ వంటి రాష్ట్రాలు అనుసరించాయన్న సీఎం
- ఇప్పుడు ట్రంప్ కూడా తమ తరహా హామీలు ఇస్తున్నారని వ్యాఖ్య 2

దేశం నుంచి ఆశించడమే కాదు.. సేవ చేయండి

జెన్ జెడ్, జెన్ ఆల్ఫాకు నిర్మల సీతారామన్

- దేశం కోసం ఏం చేయగలరో యువత ఆలోచించాలన్న నిర్మలా సీతారామన్
- యువత నాయకత్వం చేపట్టి దేశానికి తొలి ప్రాధాన్యం ఇవ్వాలన్న కేంద్రమంత్రి
- ప్రపంచ అనిశ్చితిలోనూ భారత్ 7.8 శాతం వృద్ధి సాధించిందని వ్యాఖ్య
- తమిళనాడులో గ్లోబల్ కంపెనీలతో ఉపాధి అవకాశాలు పుష్కలమన్న మంత్రి 2



కాంగ్రెస్ ఓటమి ఖాయం

ఉద్యోగులతో పెట్టుకుంటున్నారు..: కవిత

- ఉద్యోగులతో విభేదించిన ప్రభుత్వాలు మళ్లీ అధికారంలోకి రాలేదని కవిత వ్యాఖ్య
- కాంగ్రెస్ ప్రభుత్వం ఓడిపోవడం ఖాయమని విమర్శలు
- ఉద్యోగులు, ఉపాధ్యాయులను ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని ఆరోపణ
- 630 మండలాలకు 8 మంది పర్మినెంట్ ఎంఈవోలే ఉన్నారని విమర్శ
- పీఆర్సీ, డీపలపై ప్రభుత్వం స్పందించడం లేదని ఆరోపణ 2



తీవ్ర రూపం దాల్చింది

- 22ఏ భూముల సమస్య తీవ్ర రూపం దాల్చింది: రఘునందన్ రావు
- లక్షలాది మంది ప్రజలు రిజిస్ట్రేషన్లు కాక ఇబ్బంది పడుతున్నారన్న రఘునందన్ రావు 2
- అసెంబ్లీలో మంత్రి పొంగులేటి సమాధానం దాటవేశారని విమర్శ
- కాంగ్రెస్ ప్రభుత్వం బురద చల్లే రాజకీయాలు చేస్తోందని మండిపాటు





58 యుద్ధాల ప్రభావం

850 కోట్ల మందిపై పడింది: కేపీ పాల్

- నిత్యావసర వస్తువులు, ఇంధన ధరల పెరుగుదలపై పాల్ ఆవేదన
- ఇరాన్ యుద్ధం వల్ల అంతర్జాతీయ సరఫరా వ్యవస్థ దెబ్బతిన్నదని వ్యాఖ్య
- ప్రపంచ శాంతి కోసం టైమ్స్ స్క్వేర్ వద్ద ప్రశాంతతా కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు వెల్లడి

కేటీఆర్‌కు బల్మూరి వెంకట్ కౌంటర్

- సైఫాబాద్ ఘటనపై కేటీఆర్‌కు ప్రభుత్వ విప్ బల్మూరి వెంకట్ కౌంటర్
- కేటీఆర్ కంటే తాము ఘాటుగా తిట్టగలమన్న వెంకట్
- తమ తల్లిదండ్రులు సంస్కారం నేర్పించారని వ్యాఖ్య
- తాతా మధు వాడిన భాషనే కేటీఆర్ పీఏ, పీఆర్వోలు పోలీసులపై వాడారని మండిపాటు 2



నక్కా సుశీల రాణి
లొంగుబాటు

మొదటి పేజీ రువాయి

సమన్వయంతో సాగించిన వ్యూహాత్మక చర్యల వల్ల ఈ ఏడాది ఇప్పటి వరకు రికార్డు స్థాయిలో మొత్తం 266 మంది అజ్ఞాత మావోలు హింసామార్గాన్ని వీడి లొంగిపోయారు. ఈ ఏడాది లొంగిపోయిన వారిలో ముగ్గురు కేంద్ర కమిటీ సభ్యులు, 12 మంది రాష్ట్ర కమిటీ సభ్యులు, ఒక ప్రాంతీయ కమిటీ సభ్యుడు, 25 మంది డివిజనల్ కమిటీ కార్యదర్శులు/సభ్యులు ఉన్నారని పోలీసులు తెలిపారు. వీరితో పాటు 94 మంది ఏరియా కమిటీ సభ్యులు, 131 మంది సాధారణ మావోయిస్టులు లొంగిపోవడంతో పార్టీ నెట్‌వర్క్ అగ్రస్థాయి నుంచి క్షేత్రస్థాయి వరకు పూర్తిగా ఛిన్నాభిన్నమైందని వెల్లడించారు. ప్రస్తుతం తెలంగాణకు చెంది బయటి రాష్ట్రాల్లో పనిచేస్తున్న ముప్పాళ్ల లక్ష్మణ్‌రావు (గణపతి), జడె రత్నబాయి (సుజాత), వార్త శేఖర్ (మంగు) అనే ముగ్గురు నేతలు మాత్రమే అజ్ఞాతంలో మిగిలారని పోలీసులు ధ్రువీకరించారు. సుశీల రాణి లొంగుబాటుతో మావోయిస్టు పార్టీ పూర్తిగా బలహీన పడిందని... అజ్ఞాతంలో ఉన్న మిగిలిన వారందరూ తెలంగాణ ప్రభుత్వం అందిస్తున్న లొంగుబాటు, పునరావాస విధానాన్ని ఉపయోగించుకుని సాధారణ జనజీవన స్రవంతిలో కలవాలని పోలీసు శాఖ విజ్ఞప్తి చేసింది.

కేటీఆర్‌కు బల్మూరి
వెంకట్ కౌంటర్

మొదటి పేజీ రువాయి

ఎర్రవల్లి పసుపు నీళ్లే వివాదం..

మొదటి పేజీ రువాయి

కొనసాగించాలని పోలీసులకు స్పష్టం చేసింది. ఏడేళ్లలోపు శిక్ష పడే సెక్షన్ల కింద కేసులు నమోదైనప్పుడు నిందితులను ఎలా అరెస్టు చేస్తారని హైకోర్టు ప్రశ్నించింది. ఈ విషయంలో సుప్రీంకోర్టు మార్గదర్శకాలు స్పష్టంగా ఉన్నాయని గుర్తుచేసింది. వాటిని పక్కనపెట్టి అరెస్టులకు ఎలా వెళతారని పోలీసుల తీరుపై అసంతృప్తి వ్యక్తం చేసింది. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించవద్దని హెచ్చరించింది. మాజీ సీఎం కేసీఆర్ ఫామ్‌హౌస్ ఉన్న ఎర్రవల్లి ప్రాంతంలో కాంగ్రెస్ నిర్వహించిన నిరసన కార్యక్రమం తర్వాత ఈ వివాదం మొదలైంది. నిరసన జరిగిన ప్రాంతాన్ని బీఆర్ఎస్ కార్యకర్తలు పసుపు నీళ్లతో శుద్ధి చేశారు. ఈ ఘటన రాష్ట్ర రాజకీయాల్లో తీవ్ర చర్చకు దారితీసింది. ఈ వ్యవహారంపై కాంగ్రెస్ నేతలు, స్థానికుల ఫిర్యాదులతో పోలీసులు కేసు నమోదు చేశారు. వివిధ సెక్షన్ల కింద కేసులు పెట్టారు. నిందితులను అరెస్టు చేసేందుకు పోలీసులు ప్రయత్నించడంతో వారిలో కొందరు హైకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌పై మంగళవారం విచారణ జరిపిన ధర్మాసనం.. నిందితుల అరెస్టుపై స్పష్టమైన ఆదేశాలు ఇచ్చింది. తదుపరి చర్యలను నిబంధనలకు అనుగుణంగా చేపట్టాలని పోలీసులను ఆదేశించింది.

58 యుద్ధాల ప్రభావం

మొదటి పేజీ రువాయి

ప్రపంచవ్యాప్తంగా సాగుతున్న యుద్ధాల కారణంగా నిత్యావసర వస్తువులు, ఇంధన ధరలు నియంత్రణ లేకుండా పెరిగిపోతుండటంపై ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటివరకు ప్రపంచంలో జరిగిన వివిధ 58 యుద్ధాల ప్రభావం దాదాపు 200 దేశాలలోని 850 కోట్ల మంది ప్రజలపై తీవ్రంగా పడిందని ఆయన పేర్కొన్నారు. ముఖ్యంగా ఈ ఏడాది ఫిబ్రవరి చివరి నుంచి ప్రారంభమై ఆరు నెలలుగా కొనసాగుతున్న అమెరికా – ఇరాన్ సైనిక ఉద్రిక్తతల వల్ల అంతర్జాతీయ సరఫరా వ్యవస్థ దెబ్బతిని, సామాన్యుడికి నిత్యావసరాలు అందని ద్రాక్షగా మారాయని అన్నారు. మార్కెట్లో రూ. 100 ఉండే వస్తువుల ధరలు రూ. 200 నుండి రూ. 300 వరకు పెరిగాయని, లీటర్ పెట్రోల్, గ్యాస్ ధరలు 2 డాలర్ల నుండి ఏకంగా 4 నుండి 5 డాలర్లకు పైగా భారమయ్యాయని లెక్కలతో వివరించారు. ధనిక వర్గాలకు దీనివల్ల పెద్దగా ఇబ్బంది లేకపోయినప్పటికీ, సమాజంలో ఉన్న 90 శాతం పేద, మధ్యతరగతి ప్రజలు ఈ ద్రవ్యోల్బణంతో అల్లాడిపోతున్నారని చెప్పారు. ప్రపంచవ్యాప్తంగా శాంతి నెలకొంటేనే ధరల నియంత్రణ సాధ్యమవుతుందని స్పష్టం చేసిన కేఏ పాల్, గ్లోబల్ పీస్ సాధన కోసం రాబోయే సెప్టెంబర్ 28న వాషింగ్టన్ డీసీలోని టైమ్స్ స్క్వేర్ వద్ద ప్రత్యేక ప్రశాంతతా కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు వెల్లడించారు.

సేవ చేయండి

మొదటి పేజీ రువాయి

దేశం నుంచి మనం ఏం ఆశించాలనే దానికంటే, దేశానికి మనం ఏం చేయగలమనే అంశంపైనే యువత ప్రధానంగా దృష్టి సారించాలని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్ పిలుపునిచ్చారు. యువత ఆకాంక్షలను వినడానికి దేశం సిద్ధంగా ఉందని, అయితే అదే సమయంలో వారు తమ పౌర బాధ్యతలను కూడా చిత్తశుద్ధితో నిర్వర్తించాలని ఆమె సూచించారు. మంగళవారం చెన్నైలోని డాక్టర్ ఎంజీఆర్ ఎడ్యుకేషనల్ అండ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ 36వ స్నాతకోత్సవంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. "యువత నాయకత్వం బాధ్యతలు చేపట్టాలి. దేశ హితానికే ప్రథమ ప్రాధాన్యతనివ్వాలి. దేశం సురక్షితంగా, పటిష్ఠంగా ఉన్నప్పుడే మనకు నివసించడానికి ఒక ప్రశాంతమైన ఆవాసం ఉంటుంది. మన మాతృభూమిని ఎన్నటికీ వదులుకోకూడదు" అని నిర్మల సీతారామన్ పేర్కొన్నారు. రష్యా-ఉక్రెయిన్ యుద్ధం, మధ్యప్రాచ్యంలో నెలకొన్న అశాంతి వంటి ప్రపంచ పరిణామాలను ప్రస్తావిస్తూ, దేశ భద్రత, స్థిరత్వం యొక్క ఆవశ్యకతను ఆమె ఈ సందర్భంగా నొక్కిచెప్పారు. ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక అనిశ్చితి నెలకొన్నప్పటికీ, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో భారత్ స్థూల ఆర్థిక స్థిరత్వాన్ని కాపాడుకుంటూ 7.8 శాతం వృద్ధి రేటును సాధించిందని ఆమె కొనియాడారు. తమిళనాడు రాష్ట్రం పారిశ్రామిక, సాంకేతిక రంగాలలో హబ్‌గా విరాజిల్లుతోందని, ముఖ్యంగా శ్రీపెరంబుదూర్-ఒరగడమ్ కారిడార్ ఆటోమొబైల్, స్మార్ట్‌ఫోన్ల ఎగుమతుల అంతర్జాతీయ కేంద్రంగా నిలుస్తోందని తెలిపారు. కోయంబత్తూరు, మధురై వంటి నగరాల్లోని గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లు (జీసీసీలు) వేలాది మందికి ఉపాధి కల్పిస్తున్నాయని ఆమె వివరించారు. ఉద్యోగినులను ప్రోత్సహించేందుకు వీలుగా ప్రతి జిల్లాలో వర్కింగ్ విమెన్స్ హాస్టళ్లను ఏర్పాటు చేసేందుకు బడ్జెట్‌లో ప్రత్యేక నిధులను కేటాయించినట్లు ఆమె గుర్తుచేశారు. ఈ సందర్భంగా 'తిరుక్కురళ్'లోని సూక్తులను ఉటంకిస్తూ, పట్టభద్రులు అహంకారాన్ని వీడి వినయంతో మెలగాలని, జీవితంలో ఎదురయ్యే సవాళ్లను ధైర్యంగా ఎదుర్కోవాలని ఆమె హితవు పలికారు.

గ్యారెంటీ పథకాలు సక్సెస్

మొదటి పేజీ రువాయి

కర్ణాటకలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ గ్యారెంటీ పథకాలు అంతర్జాతీయ స్థాయిలో ప్రజాదరణ పొందాయని, చివరికి అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ కూడా తమ పథకాలనే కాపీ కొడుతున్నారని కర్ణాటక ముఖ్యమంత్రి డీకే శివకుమార్ వ్యాఖ్యానించారు. బెంగళూరులో విలేకరులతో మాట్లాడిన ఆయన, తమ ప్రభుత్వ గ్యారెంటీ పథకాలు బ్లాక్‌బస్టర్ విజయం సాధించాయని అన్నారు. నవంబర్‌లో జరిగే అమెరికా మిడ్‌టర్మ్ ఎన్నికల్లో రిపబ్లికన్లు గెలిచి కాంగ్రెస్‌లోని ప్రతినిధుల సభ, సెనెట్‌లపై ఆధిపత్యం సాధిస్తే ప్రతి వయోజన అమెరికన్‌కు 5,000 డాలర్ల చొప్పున 'డివిడెండ్' ఇస్తామని ట్రంప్ ప్రకటించడాన్ని డీకే శివకుమార్ ఈ సందర్భంగా ప్రస్తావించారు. గతంలో మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, రాజస్థాన్, బీహార్ వంటి రాష్ట్రాలు తమ కర్ణాటక మోడల్‌ను అనుసరించాయని, ఇప్పుడు ప్రపంచంలోనే అగ్రరాజ్యమైన అమెరికా అధ్యక్షుడు కూడా ఓటర్లను ఆకట్టుకునేందుకు ఇదే తరహా సంక్షేమ హామీలను ఇస్తున్నారని పేర్కొన్నారు. ఇది కాంగ్రెస్ సిద్ధాంతాలకు, భారత రాజ్యాంగ విలువలకు దక్కిన అంతర్జాతీయ గుర్తింపు అని ఆయన అభివర్ణించారు.

కేటీఆర్‌కు బల్మూరి వెంకట్ కౌంటర్

మొదటి పేజీ రువాయి

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, ఆయన పీఏ, పీఆర్వోల ప్రవర్తనపై తెలంగాణ ప్రభుత్వ విప్, కాంగ్రెస్ ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. ఢిల్లీలో మీడియాతో మాట్లాడిన ఆయన, ప్రతిపక్షంలో ఉన్నామనే నిరాశతో బీఆర్ఎస్ నేతలు మీడియా దృష్టిని ఆకర్షించేందుకే నాటకాలాడుతున్నారని దుయ్యబట్టారు. కేటీఆర్ కంటే ఘాటుగా తిట్టడం తమకు వచ్చని, అయితే తమ తల్లిదండ్రులు విజ్ఞత, సంస్కారం నేర్పించారని పేర్కొన్నారు. సైఫాబాద్ పోలీస్ స్టేషన్‌లో కేటీఆర్ పీఏ, పీఆర్వోలపై ఎలాంటి దాడి జరగలేదని ఉన్నతాధికారులు ఇప్పటికే తేల్చిచెప్పారని, గణేశ్ మండపం డీజే అనుమతి కోసం వచ్చిన కొందరు యువకుల సమక్షంలో కేటీఆర్ సిబ్బంది అనవసరంగా రాద్ధాంతం చేశారని మండిపడ్డారు. స్పీకర్‌పై ఎమ్మెల్సీ తాతా మధు వాడిన అనుచిత భాషనే కేటీఆర్ పీఏ, పీఆర్వోలు కూడా పోలీసులపై ఉపయోగించారని, ఇది కేటీఆర్ అహంకారపూరిత వైఖరికి నిదర్శనమని విమర్శించారు. బీఆర్ఎస్ తీరు వల్ల ఒక సామాజిక వర్గానికి చెడ్డపేరు వస్తోందని, తెలంగాణ సమాజానికి, దళితులకు కేటీఆర్ తక్షణమే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. పదేళ్లు ప్రతిపక్షంలో ఉన్నప్పుడు తన పక్కటెముకలు విరిగినా ఏనాడూ శాంతిభద్రతలకు విఘాతం కలిగించలేదని వెంకట్ అన్నారు. కేటీఆర్ సిబ్బంది ప్రవర్తన మార్చుకోకపోతే పోలీసులు చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటారని హెచ్చరించారు.

కాంగ్రెస్ ఓటమి ఖాయం

మొదటి పేజీ రువాయి

ఉద్యోగులు, ఉపాధ్యాయులతో పెట్టుకున్న ప్రభుత్వాలు మళ్లీ అధికారంలోకి వచ్చిన దాఖలాలు లేవని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అన్నారు. ఉద్యోగులు, ఉపాధ్యాయుల సమస్యలపై హైదరాబాద్ బాగ్ లింగంపల్లిలో మంగళవారం నిర్వహించిన సదస్సులో ఆమె మాట్లాడారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులను కాంగ్రెస్ ప్రభుత్వం తీవ్రంగా ఇబ్బందులకు గురిచేస్తోందని ఆరోపించారు. వారిని చిన్నచూపు చూస్తూ నిర్లక్ష్యం చేస్తోందని మండిపడ్డారు. ఈసారి ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వం ఓడిపోవడం ఖాయమని వ్యాఖ్యానించారు. తాము అధికారంలోకి వస్తే ప్రభుత్వ ఉద్యోగులను రాష్ట్ర అభివృద్ధిలో కీలక భాగస్వాములుగా చూస్తామని కవిత చెప్పారు. ఉద్యోగులను గౌరవించేలా, వారు సంతోషంగా పనిచేసేలా తమ ప్రభుత్వం విధానాలు రూపొందిస్తుందని తెలిపారు. తెలంగాణ ఉద్యమ సమయంలో ఉపాధ్యాయులు ఉద్యోగం కన్నా ఉద్యమానికే ప్రాధాన్యం ఇచ్చి పోరాడారని కవిత గుర్తు చేశారు. రాష్ట్రంలో 630 మండలాలకు కేవలం ఎనిమిది మంది పర్మినెంట్ మండల విద్యాధికారులు (ఎంఈవోలు) ఉండటం విద్యా వ్యవస్థపై ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమని విమర్శించారు. ఉచిత, నాణ్యమైన విద్య అందాలంటే బలమైన యంత్రాంగం అవసరమని అన్నారు. విద్యార్థుల వివరాలు, రిపోర్టుల పేరుతో ఉపాధ్యాయులను బోధనకు దూరం చేస్తున్నారని ఆరోపించారు. ఒక్క ఉపాధ్యాయుడితో నడుస్తున్న పాఠశాలల్లో పరిస్థితి మరింత దారుణంగా ఉందన్నారు. ఉద్యోగుల సహకారం లేకుండా ప్రభుత్వం ఏ కార్యక్రమాన్నీ సమర్థంగా అమలు చేయలేదని కవిత అన్నారు. రాష్ట్రంలో సంక్షేమ పథకాల అమలు కూడా ఆశించిన స్థాయిలో లేదని విమర్శించారు. మైకుల ముందు ఎన్ని గొప్పలు చెప్పినా పెన్షన్లు, యూరియా, రైతులకు విద్యుత్ అందించడంలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. ఎన్నికల ముందు పీఆర్సీ, డీఏలు ఇస్తామని హామీ ఇచ్చిన ప్రభుత్వం ఇప్పటివరకు వాటిపై స్పందించలేదని అన్నారు.

తీవ్ర రూపం దాల్చింది

మొదటి పేజీ రువాయి

తెలంగాణలో 22ఏ నిషేధిత జాబితా భూముల సమస్య తీవ్ర రూపం దాల్చిందని, దీనివల్ల లక్షలాది మంది సామాన్య ప్రజలు రిజిస్ట్రేషన్లు కాక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని మెదక్ బీజేపీ ఎంపీ రఘునందన్ రావు ఆందోళన వ్యక్తం చేశారు. న్యూఢిల్లీలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర అసెంబ్లీ సమావేశాల్లో 22ఏ భూములపై స్పష్టమైన చారిత్రాత్మక నిర్ణయం వస్తుందని ఆశించిన ప్రజలకు నిరాశే మిగిలిందని రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. ఈ అంశంపై రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి కనీస సన్నాహాలు లేకుండా సభకు వచ్చి అరకొర సమాచారంతో సమాధానం దాటవేసే ప్రయత్నం చేశారని విమర్శించారు. బీఆర్ఎస్ పాలనలో కోటి ఎకరాలకు పైగా భూములను అడ్డగోలుగా 22ఏ జాబితాలో చేర్చిన అధికారులపై ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. మంత్రి ప్రతిపాదిస్తున్నట్లు, ఇప్పటివరకు తొలగించామంటున్న 47,440 ఎకరాల వివరాలు ఏ గ్రామంలో ఎక్కడున్నాయో బహిర్గతం చేయాలని, మిగిలిన భూములపై తక్షణమే శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణ హైకోర్టు సిట్టింగ్ జడ్జితో కూడిన ప్రత్యేక కమిటీని నియమించి ధరణి, భూభారతి లొసుగుల వల్ల నష్టపోయిన పేదలకు న్యాయం చేయాలని రఘునందన్ రావు కోరారు. ప్రజా సమస్యలపై నిలదీస్తే బీజేపీ, బీఆర్ఎస్ ఒకటేనంటూ రేవంత్ సర్కార్ బురదజల్లే రాజకీయాలు చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వస్తే మొదటి కేబినెట్ సమావేశంలోనే భూ సమస్యలకు పరిష్కారం చూపుతామని ఎంపీ స్పష్టం చేశారు.

దాడి చేశారు

మొదటి పేజీ రువాయి

పిలిపించి చీకటి పడే వరకు కాలయాపన చేసి ఈ కుట్రకు తెరలేపారని కేటీఆర్ ఆరోపించారు. కాంగ్రెస్ గుండాలు ఈ దాడికి పాల్పడ్డారా? లేక పోలీసులే మఫ్టీలో ముసుగులు వేసుకుని వచ్చారా? అనే దానిపై నిజాలు బయటకు రావాలంటే తక్షణమే సిట్టింగ్ జడ్జితో స్వతంత్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. స్టేషన్ లోపల, బయట ఉన్న సీసీటీవీ ఫుటేజీని వెంటనే భద్రపరచాలని, గాయపడిన తన సిబ్బందికి రక్షణ కల్పించి మెరుగైన వైద్యం అందించాలని డిమాండ్ చేశారు. ఈ చర్యలను నిరసిస్తూ కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీని 'ఎక్స్' వేదికగా ట్యాగ్ చేస్తూ 'వెల్‌డన్ కాంగ్రెస్' అంటూ వ్యంగ్యాస్త్రాలు సంధించారు.

చర్చించేందుకు
సిద్ధం

మొదటి పేజీ రువాయి



22-ఏ నిషేధిత భూముల జాబితా ప్రక్షాళన, భూ యజమానుల సమస్యల పరిష్కారం, రిజిస్ట్రేషన్లకు ఎదురవుతున్న ఇబ్బందులను తొలగించే అంశాలపై ప్రభుత్వం దృష్టి సారించింది. గతంలో 22ఏ భూముల విషయంలో జరిగిన పరిణామాలు, ప్రస్తుతం ఉన్న సమస్యలు, ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను సభలో వివరించే అవకాశం ఉంది. అదే విధంగా అసెంబ్లీలో 22ఏ అంశాన్ని ఎలా ప్రస్తావించాలి, ప్రతిపక్షాల విమర్శలకు ఏ విధంగా సమాధానం ఇవ్వాలనే దానిపైనా మంత్రులతో చర్చించినట్లు తెలుస్తోంది. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో చోటుచేసుకున్న భూ అక్రమాల అంశాన్ని కూడా రేపు సభలో ప్రస్తావించాలని రేవంత్ రెడ్డి భావిస్తున్నట్లు తెలుస్తోంది. 22ఏ భూముల వ్యవహారంలో అసలు సమస్యకు కారణాలేంటి? గతంలో భూముల కేటాయింపులు, రిజిస్ట్రేషన్లు ఎలా జరిగాయి? ఎవరి హయాంలో ఎలాంటి నిర్ణయాలు తీసుకున్నారు? అనే అంశాలను సభా వేదికగా సీఎం వివరించే అవకాశం ఉంది. మొత్తంగా 22ఏ భూముల అంశంపై రేపటి అసెంబ్లీ చర్చకు ముందే రేవంత్ రెడ్డి మంత్రులతో కసరత్తు చేసినట్లు సమాచారం. ఒకవైపు ప్రభుత్వ నిర్ణయంపై స్పష్టత ఇవ్వడంతోపాటు, మరోవైపు నిజంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న సామాన్యులకు వెసులుబాటు కల్పించేలా పరిష్కార మార్గాలను అన్వేషించినట్లు తెలుస్తోంది.

జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖాధికారి వారి కార్యాలయము, నాగర్ కర్నూల్

పత్రిక ప్రకటన

ప్రకటన నంబర్:1695/ Estt/DMHO/NGKL/2026, తేదీ:15 .09.2026

ఇందు మూలముగా తెలియజేయునది ఏమనగా, కలెక్టర్ మరియు జిల్లా మేజిస్ట్రేట్, నాగర్ కర్నూల్ వారి ఆదేశానుసారము జిల్లా లోని పలు రకాల ఖాళీలు కలిగిన ఉద్యోగాలను ఒక సంవత్సరం కొరకు కాంట్రాక్ట్ పద్ధతిలో భర్తీ చేయుటకు ప్రకటన జారి చేయడం జరిగినది. అర్హత కలిగిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకొనుటకు వివరాలకు **www.nagarkurnool.telangana.gov.in** " వెబ్ సైట్ నందు పొందవచ్చు.

జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖాధికారి వారి కార్యాలయము, (IDOC) Kollapur X Road నాగర్ కర్నూల్ యందు దరఖాస్తు చేసుకొనుటకు తేది: 16.09.2026 to 22.09.2026 సాయంత్రం 5.00 గంటల వరకు. (అన్ని పని దినాలలో) దరఖాస్తులు స్వీకరించబడును.

జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖాధికారి
నాగర్ కర్నూల్

జిల్లా వైద్య, ఆరోగ్య శాఖలో కాంట్రాక్టు పద్ధతిలో ఉద్యోగ అవకాశాలు

నాగర్ కర్నూల్, మన ప్రజాపక్షం :
నాగర్ కర్నూల్ జిల్లాలో జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖలో ఉన్న ఖాళీలను భర్తీ చేయుట కొరకు జిల్లా కలెక్టర్ మరియు జిల్లా మేజిస్ట్రేట్ వారి ఆదేశానుసారం ఒక సంవత్సరం కొరకు పనిచేయుటకు అర్హత కలిగిన అభ్యర్థుల నుండి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి మంగళవారం ఒక ప్రకటన విడుదల చేసారు. ఆసక్తి కలిగిన అర్హత ఉన్న అభ్యర్థులు www.nagarkurnool.telangana.gov.in వెబ్సైట్ నందు దరఖాస్తు చేసుకొనుటను వివరాలను పొందవచ్చునని తెలిపారు. జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి వారి కార్యాలయము (ఐడిఓసి), కొల్లాపూర్ చౌరస్తా, నాగర్ కర్నూల్ నందు దరఖాస్తు చేసుకొనుటకు తేది 16.09.2026 నుండి 22.09.2026 సాయంత్రం 5.00 గంటల వరకు (అన్ని పని దినాలలో) దరఖాస్తులు స్వీకరించబడునని తెలిపారు.

ఈశాన్ యూత్ ఆధ్వర్యంలో ఘనంగా గణనాథుడి పూజలు

ముఖ్యఅతిథిగా 10వ వార్డు కౌన్సిలర్ జే.పీ చారి



నాగర్ కర్నూల్, మన ప్రజాపక్షం:నాగర్ కర్నూల్ మున్సిపాలిటీ పరిధిలోని రామ్ నగర్ కాలనీ ఈశాన్ యూత్ ఆధ్వర్యంలో గణనాథుడి పూజా కార్యక్రమాన్ని యూత్ సభ్యులు ఘనంగా అంగరంగవైభవంగా నిర్వహించారు.ఈ పూజ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా 10వ వార్డు కౌన్సిలర్ జేపీ చారి కుటుంబ సమేతంగా విచ్చేసి గణనాథుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గణనాథుడి ఆశీస్సులు కాలనీ వాసులకు, పట్టణ ప్రజలకు ఉండాలని ప్రతీ ఒక్కరూ సుఖ సంతోషాలతో, ఆయురారోగ్యాలతో చల్లగా జీవించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఈశాన్ యూత్ సభ్యులు,కాలనీవాసులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని పూజా కార్యక్రమం విజయవంతం చేశారు.



ఠాణాలో కొలువుదీరిన గణనాథుడు

మత సామరస్యానికి ప్రతీకగా నిలిచిన ఎస్ఐ షంషోద్దీన్

బిజినపల్లి,మన ప్రజాపక్షం:
మత సామరస్యానికి ప్రతీకగా నిలుస్తూ నాగర్ కర్నూల్ జిల్లా బిజినపల్లి పోలీస్ స్టేషన్ ఎస్ఐ షంషోద్దీన్ వినూత్న కార్యక్రమం చేపట్టారు.అతను ముస్లిం అయినప్పటికీ 17 సంవత్సరాల తర్వాత మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ ఆవరణలో సోమవారం వినాయకుడి విగ్రహాన్ని ప్రతిష్టించి స్వయంగా ప్రత్యేక పూజలు చేశారు.ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్కు వచ్చిన వివిధ గ్రామాల ప్రజలు ఎస్ఐ షంషోద్దీన్ మత సామరస్యం పట్ల చూపిన నిబద్ధతను అభినందించారు.ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ గ్రామాల్లో ప్రజలంతా పండుగలను ప్రశాంత వాతావరణంలో అన్ని మతాల వారు కలిసి మెలిసి ఆనందంగా జరుపుకోవాలని కోరారు.ఈ పూజా కార్యక్రమంలో ఏఎస్ఐ కృష్ణయ్య, హెడ్ కానిస్టేబుల్స్ సతీష్, శేఖర్ గౌడ్, నారాయణ, జితేందర్ నాయక్, అంకిత, శివకుమార్, రమేష్, రాము, నాయకులు తిరుపతయ్య, మిద్దె రాము, గోవిందు నాయక్, వాల్యానాయక్,ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

పిఎం శ్రీ పాఠశాలల అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి

నిధులను నిబంధనల ప్రకారం సద్వినియోగం చేయాలి
ఆర్జేడీ ఎం.సోమిరెడ్డి



నాగర్ కర్నూల్, మన ప్రజాపక్షం :
పిఎం శ్రీ పాఠశాలల అభివృద్ధిపై ఆర్జేడీ సోమిరెడ్డి సమీక్ష నిర్వహించారు.తాడూర్ మండల పరిధిలోని మేడిపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను మంగళవారం రాష్ట్ర ప్రాంతీయ విద్యా సంచాలకులు ఎం. సోమిరెడ్డి సందర్శించారు.ఈ సందర్భంగా పాఠశాలలో పిఎం శ్రీ పథకం కింద కేటాయించిన నిధుల వినియోగం, చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాల వివరాలను పరిశీలించి, వివిధ అంశాలపై పాఠశాల సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు.అనంతరం పాఠశాలలోని తరగతి గదులు, బడి తోట, విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనం, కాంపౌండ్ వాల్, సిడబ్ల్యూఎస్ఎన్ విద్యార్థుల కోసం నిర్మించిన ర్యాంపులు తదితర సౌకర్యాలను పరిశీలించారు. పాఠశాలలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలపై సంతృప్తి వ్యక్తం చేశారు. పాఠశాలలో నిర్వహించిన హిందీ దివస్ సందర్భంగా విద్యార్థుల రాస్తున్న ప్రశ్నావళిని కూడా పరిశీలించిన ఆర్జేడీ, విద్యార్థులు రూపొందించిన శబ్దావళి, చిత్రలేఖనాలను పరిశీలించి విద్యార్థులకు తగిన సూచనలు చేశారు.మేడిపూర్ పాఠశాల సందర్శన అనంతరం నాగర్ కర్నూల్ జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయాన్ని సందర్శించి, ఆర్జేడీ ఎం. సోమిరెడ్డి, జిల్లా విద్యాశాఖ అధికారి రమేష్ కుమార్తో కలిసి జిల్లాలోని పిఎం శ్రీ పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. మేడిపూర్ పాఠశాలలో పరిశీలించిన అంశాల నేపథ్యంలో జిల్లాలోని పిఎం శ్రీ పాఠశాలల్లో నిధుల వినియోగం,పాఠశాలల అభివృద్ధి, మౌలిక వసతుల కల్పన, విద్యా ప్రమాణాల మెరుగుదల తదితర అంశాలపై ప్రధానోపాధ్యాయుల నుంచి వివరాలను తెలుసుకున్నారు.ఈ సందర్భంగా ఆర్జేడీ ఎం.సోమిరెడ్డి మాట్లాడుతూ పిఎం శ్రీ పాఠశాలలను ఆదర్శవంతమైన విద్యా సంస్థలుగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం అందిస్తున్న నిధులను నిబంధనల ప్రకారం పూర్తిస్థాయిలో సద్వినియోగం చేయాలని ఆయన సూచించారు. నిధులతో చేపట్టే అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలను పాటిస్తూ, నిర్ణీత సమయంలో పనులను పూర్తి చేయాలన్నారు.పాఠశాలల్లో విద్యార్థులకు ఆహ్లాదకరమైన, సురక్షితమైన విద్యా వాతావరణాన్ని కల్పించడంతో పాటు బడి తోటలు, గ్రంథాలయాలు, ప్రయోగశాలలు, క్రీడా సౌకర్యాలను సమర్థవంతంగా వినియోగంలోకి తీసుకురావాలని సూచించారు. సీడబ్ల్యూఎస్ఎన్ విద్యార్థులకు అవసరమైన సౌకర్యాలను కల్పిస్తూ, ప్రతి విద్యార్థికి సమానమైన విద్యా అవకాశాలు అందేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. విద్యార్థుల్లో సృజనాత్మకత, భాషా నైపుణ్యాలు, విద్యా సామర్థ్యాలను పెంపొందించేలా వివిధ కార్యక్రమాలను నిర్వహించాలని ప్రధానోపాధ్యాయులు,ఉపాధ్యాయులకు సూచించారు. పిఎం శ్రీ పాఠశాలల లక్ష్యాలను సాధించే దిశగా అధికారులు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు సమన్వయంతో పనిచేయాలని ఆయన కోరారు.ఈ కార్యక్రమంలో సెక్టోరియల్ అధికారులు కిరణ్ కుమార్, నూరుద్దీన్, పిఎం శ్రీ పాఠశాలలను ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యాశాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సెప్టెంబర్ 17 న కలెక్టరేట్లో ప్రజా పాలన దినోత్సవ కార్యక్రమం

ప్రజాపాలన దినోత్సవానికి పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి
జిల్లా అదనపు కలెక్టర్లు బి.చెన్నయ్య,దేవ సహాయం



నాగర్ కర్నూల్, మన ప్రజాపక్షం :
మంగళవారం నాగర్ కర్నూలు జిల్లా కలెక్టరేట్లోని వీడియో సమావేశ మందిరంలో నిర్వహించిన సమావేశంలో సెప్టెంబర్ 17న జరుపబోయే ప్రజాపాలన దినోత్సవం ఏర్పాట్ల గురించి జిల్లా అధికారులకు తమ శాఖలకు సంబంధించిన పనులను అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బి.చెన్నయ్య, అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్) దేవ సహాయం, అడిషనల్ ఎస్పీ వెంకటేశ్వర్లు జిల్లా అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.అదనపు కలెక్టర్లు మాట్లాడుతూ నాగర్కర్నూల్ జిల్లా సమీకృత కలెక్టరేట్ కార్యాలయ సముదాయంలో నిర్వహించనున్న ప్రజాపాలన దినోత్సవ కార్యక్రమానికి అధికారులందరూ ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని, ఈ కార్యక్రమంలో జాతీయ జెండా ఆవిష్కరణకు సంబంధించిన ఏర్పాట్లను ముందస్తుగా పూర్తి చేయాలని, జాతీయ పతాకం ఏర్పాటు, సభా వేదిక అలంకరణ, ప్రొటోకాల్ ప్రకారం వీఐపీలు, ప్రజా ప్రతినిధులు, ప్రజలు, విద్యార్థులకు అవసరమైన సౌకర్యాలు కల్పించాలన్నారు.అలాగే షామియానాలు, కుర్చీలు, బ్యారికేడ్లు, తాగునీటి వసతి తదితర ఏర్పాట్లను పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు. సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణ, ఆహ్వాన పత్రికల పంపిణీ వంటి అంశాల్లోనూ ఎలాంటి లోటుపాట్లు లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు.ముఖ్య అతిథి సందేశం తదితర కార్యక్రమాలకు సంబంధించి అధికారులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు.ప్రజాపాలన దినోత్సవం ప్రాధాన్యతను దృష్టిలో ఉంచుకుని ప్రతి శాఖకు అప్పగించిన విధులను బాధ్యతగా నిర్వర్తించాలని, ఇతర శాఖలతో సమన్వయం చేసుకుంటూ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు. ఈ సమావేశంలో డిఆర్ఓ పాండు,కలెక్టరేట్ ఏ.ఓ చంద్రశేఖర్, వివిధ శాఖల జిల్లా అధికారులు, సంబంధిత సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మూడు గ్రామాల సర్పంచుల చెక్ పవర్ నిషేధం

ఎత్తం సర్పంచ్, ఉప సర్పంచ్ సస్పెన్షన్
జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్

నాగర్ కర్నూల్, మన ప్రజాపక్షం:
జిల్లాలో నిబంధనల ఉల్లంఘన, అధికార దుర్వినియోగం, ప్రభుత్వ నిధుల వినియోగంలో అవకతవకలకు సంబంధించి పలువురు ప్రజాప్రతినిధులపై జిల్లా యంత్రాంగం చర్యలు చేపట్టింది. కొల్లాపూర్, పెంట్లవెల్లి, బిజినపల్లి మండలాల పరిధిలోని మూడు గ్రామాల సర్పంచుల చెక్ పవర్ను నిషేధిస్తూ, కోడేరు మండలం ఎత్తం గ్రామ సర్పంచ్, ఉప సర్పంచ్లను సస్పెండ్ చేస్తూ జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటీల్ ఉత్తర్వులు జారీ చేశారు.కొల్లాపూర్ మండలం మొలచింతలపల్లి, పెంట్లవెల్లి మండలం పెంట్లవెల్లి, బిజినపల్లి మండలం కారుకొండ గ్రామాల సర్పంచులు గతంలో చేపట్టిన అభివృద్ధి పనులకు సంబంధించిన బిల్లుల చెల్లింపుల్లో తీవ్ర జాప్యం చేసినట్లు అధికారులు గుర్తించారు. అంతేకాకుండా తమకు అప్పగించిన అధికారాలను దుర్వినియోగం చేసినట్లు నిర్ధారణకు రావడంతో ఆయా గ్రామాల సర్పంచుల చెక్ పవర్ను నిషేధిస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేసినట్లు జిల్లా పంచాయతీ అధికారి శ్రీరాములు తెలిపారు.కోడేరు మండలం ఎత్తం గ్రామపంచాయతీలో నిధుల దుర్వినియోగంకు సంబంధించిన ఫిర్యాదులపై అధికారులు విచారణ చేపట్టారు. ఈ వ్యవహారంలో ఇప్పటికే సర్పంచ్, ఉప సర్పంచ్లకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. వారు సమర్పించిన వివరణలను అధికారులు పరిశీలించిన అనంతరం,నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించినట్లు గుర్తించి ఇద్దరినీ సస్పెండ్ చేస్తూ జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటీల్ ఉత్తర్వులు జారీ చేసినట్లు జిల్లా పంచాయతీ అధికారి శ్రీరాములు వెల్లడించారు.గ్రామపంచాయతీలకు ప్రభుత్వం కేటాయించే నిధులను నిబంధనలకు అనుగుణంగా వినియోగించాలని జిల్లా పంచాయతీ అధికారి సూచించారు.అభివృద్ధి పనులకు సంబంధించిన బిల్లుల చెల్లింపుల్లో ఎలాంటి జాప్యం జరగకుండా అధికారులు,



ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని కోరారు. ప్రజాప్రతినిధులు తమకు అప్పగించిన బాధ్యతలను నిబంధనల మేరకు నిర్వర్తించాలని, ప్రభుత్వ నిధుల వినియోగంలో పారదర్శకత, జవాబుదారీతనం పాటించాల్సిన బాధ్యత ప్రజాప్రతినిధులపై ఉందని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు.



జాతీయస్థాయి సైక్లింగ్ పోటీలలో మెరుసిన పేట విద్యార్థులు



నారాయణపేట, మన ప్రజాపక్షం :
సైక్లింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఇండియా కోచ్ డాక్టర్ మాక్స్వెల్, సైక్లింగ్ వెల్ఫేర్ అసోసియేషన్ హైదరాబాద్ వారి ధ్వర్యంలో ఈ నెల 12,13 తేదీలలో హైదరాబాద్ బండ్లగూడ నాగోల్ లో 8 సంవత్సరాల నుండి 11 సంవత్సరాల మధ్య గల బాల, బాలికలకు జరిగిన ప్రథమ క్యాడేట్ జాతీయస్థాయి సైక్లింగ్ రోడ్డు ఛాంపియన్షిప్ 2 కి.మీ పోటీలలో ఇండియాలోని 16 రాష్ట్రాల నుండి 356 మంది బాల,బాలికలు పాల్గొన్న పోటీలలో నారాయణపేట జిల్లా నుండి జిల్లా ప్రధాన కార్యదర్శి బి.గోపాలం ఆధ్వర్యంలో పాల్గొన్న ఎం.ఆద్య 8వ స్థానం, బి.సాయి ప్రణతి రెడ్డి 7వ స్థానం, బి.రితిక రెడ్డి 10వ స్థానం, కలాల్ సాహస గౌడ్ 12వ స్థానం, కలాల్ సామ్య 13వ స్థానం, నంగి కుమార్ 6 వ స్థానం సాధించి మంచి క్రీడా ప్రతిభను, నైపుణ్యతను చాటి జాతీయ స్థాయి సైక్లింగ్ సర్టిఫికెట్స్, మెడల్స్ పొందినట్లు తెలిపారు.ఈ సందర్భంగా వారికి ఈ నెల 15న శ్రీ సత్యసాయి మందిరంలో సర్టిఫికెట్స్, మెడల్స్ అందజేసి ఘనంగా సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా కార్యదర్శి బి.గోపాలం మాట్లాడుతూ మొట్టమొదటిసారిగా నారాయణపేట జిల్లా నుండి ప్రథమ జాతీయ స్థాయి సైకిల్ పోటీలలో 6 మంది చిన్నారి బాల,బాలికలు పాల్గొని ప్రశంసా పత్రాలు పొందడం చాలా ఆనందంగా ఉందని,సైకిల్ క్రీడాకారులు జాతీయ స్థాయిలో, అంతర్జాతీయ స్థాయిలో రాణించాలని అన్నారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు జి.శివకుమార్, పీఈటి అమరేష్, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

సెప్టెంబర్ 17ను విలీన దినోత్సవంగా ప్రకటించాలి

తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటాన్ని పాఠ్యాంశాల్లో చేర్చాలి

లక్షలాది ఎకరాలు పేదలకు పంచిన ఘనత సీపీఐదే

చరిత్రను వక్రీకరించడం సిగ్గుమాలిన చర్య

సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్,ఎం.డి ఫయాజ్



కల్వకుర్తి, మన ప్రజాపక్షం:
సెప్టెంబర్ 17ను తెలంగాణ విలీన దినోత్సవంగా ప్రభుత్వం అధికారికంగా ప్రకటించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్.ఎం.డి ఫయాజ్ డిమాండ్ చేశారు.మంగళవారం ఉదయం కల్వకుర్తి పట్టణంలోని మహబూబ్ నగర్ చౌరస్తాలో తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాల సందర్భంగా అమరవీరుల చిత్రపటాలకు నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట చరిత్రను పాఠ్యాంశాల్లో చేర్చి, ఆ పోరాటంలో కీలక పాత్ర పోషించిన కమ్యూనిస్టుల త్యాగాలను భావితరాలకు తెలియజేయాలని కోరారు.తెలంగాణలో భూస్వామ్య, నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా సాగిన రైతాంగ పోరాటం ఫలితంగా లక్షలాది ఎకరాల భూమిని పేదలకు పంచిన ఘనత సీపీఐ పార్టీకి ఉందన్నారు. వేలాది మంది రైతులు, కార్మికులు, ప్రజలు పోరాటంలో పాల్గొని త్యాగాలు చేశారని పేర్కొన్నారు. చారిత్రక వాస్తవాలను పక్కనపెట్టి తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట చరిత్రను వక్రీకరించడం సిగ్గుమాలిన చర్య అని విమర్శించారు. నిజమైన చరిత్రను ప్రజలకు, ముఖ్యంగా యువతకు అందించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. 1947 ఆగస్టు 15 దేశానికి స్వాతంత్రం వచ్చిన తెలంగాణ నిజాం నవాబు నిరంకుశ పాలనకు దేశముక్ లు భూస్వాములు ఈ ప్రాంత ప్రజలను పీడిస్తూ వెట్టి చాకిరి బానిసత్వం కొనసాగిస్తూ మహిళలపై అత్యాచారాలు చేస్తూ దమన కాండా నిర్వహించారు. దీనికి వ్యతిరేకంగా ఆనాడు దొడ్డి కొమరయ్య, మోహిం మోహినుద్దీన్, బద్దం ఎల్లారెడ్డి, నాయకత్వాన ఆనాడు చాకలి ఐలమ్మ,మల్లు స్వరాజ్యం,చంద్ర రాజేశ్వర్ రావు ఇలా అనేకమంది నాయకత్వంలో వేలాదిమంది కమ్యూనిస్టు పార్టీ నాయకత్వంలో సాహితులై నిజాం నవాబుకు వ్యతిరేకంగా పోరాటం చేసి సుమారు 4500 మంది ప్రాణత్యాగం చేశారని సెప్టెంబర్ 11 నుండి 17 వరకు జరిగిన పోరాటంలో వేలాదిమంది కమ్యూనిస్టు పార్టీ నాయకులు చనిపోయారని,1948 సెప్టెంబర్ 17న తెలంగాణ విలీనం జరిగిందని,కమ్యూనిస్టు పార్టీ నాయకత్వంలో సుమారు 10 లక్షల ఎకరాల భూ పంపిణీ జరిగిందని, దేశంలోనే పెద్ద పోరాటం తెలంగాణ సాయుధ పోరాటమేనని దీనిని పాఠ్యాంశాలలో చేర్చాలని భవిష్యత్ తరాలకు అందించాలని వారు డిమాండ్ చేశారు.ఈ పోరాటం భూమి కోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరి విముక్తి కోసం, సమానత్వం కోసం జరిగిందన్నారు.కానీ కొందరు రాజకీయ నాయకులు తమ స్వార్థం కోసం మత రాజకీయం సృష్టిస్తున్నారని ఇది సరైన విధానం కాదని వారన్నారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం దీన్ని గుర్తించి సెప్టెంబర్ 17న విలీన దినంగా ప్రకటించి అధికారికంగా నిర్వహించి తెలంగాణ సాయుధ పోరాటాన్ని పాఠ్యాంశాల్లో చేర్చాలని వారు డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా నాయకులు పులిజాల పరశురాములు, గడ్డం శ్రీనివాసులు, ప్రేమ్ కుమార్, సంతోష్, మండల నాయకులు దేశం సైదులు, అమీర్, శివ, మహేష్, పరశురాం గౌడ్, వెంకటయ్య, నాగరాజు, అంజి నాయక్, బాలయ్య, బాలు తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ రంగానికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలి

విద్య, వైద్య రంగాలను మరింత బలోపేతం చేయాలి

ప్రజలకు మరింత చేరువయ్యేలా వినూత్న కార్యక్రమాలకు శ్రీకారం చుట్టాలి

సమగ్ర జిల్లా అభివృద్ధే ధ్యేయంగా అధికారులు మరింత బాధ్యతతో పని చేయాలి

కేంద్ర ప్రభుత్వ పథకాల అమలుకు అవసరమైన ప్రతిపాదనలు వెంటనే సిద్ధం చేయాలి

అర్హులైన ప్రతి లబ్ధిదారునికి సంక్షేమ పథకాల ఫలాలు అందేలా చర్యలు తీసుకోవాలి

ఎంపి,దిశా కమిటీ చైర్ పర్సన్ డా. కడియం కావ్య



జనగామ, మన ప్రజాపక్షం:
జిల్లా అభివృద్ధిని లక్ష్యంగా పెట్టుకుని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలు క్షేత్రస్థాయిలో అర్హులైన ప్రతి లబ్ధిదారునికి సకాలంలో చేరేలా అధికారులు బాధ్యతాయుతంగా పని చేయాలని వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు, జిల్లా అభివృద్ధి సమన్వయ, పర్యవేక్షణ (దిశా) కమిటీ చైర్ పర్సన్ డా.కడియం కావ్య అధికారులను అదేశించారు. మంగళవారం జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలోని మెయిన్ కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలు, పురోగతిపై జిల్లా అభివృద్ధి సమన్వయ, పర్యవేక్షణ (దిశా) కమిటీ సమావేశాన్ని నిర్వహించారు.ఈ సమావేశానికి వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు, జిల్లా అభివృద్ధి సమన్వయ, పర్యవేక్షణ (దిశా) కమిటీ చైర్ పర్సన్ డా.కడియం కావ్య, ఘనపూర్ (స్టేషన్) ఎమ్మెల్యే కడియం శ్రీహరి, జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, డీసీపీ రాజమహేంద్ర నాయక్, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బెన్షాలోం, దిశా కమిటీ సభ్యురాలు కేసిరెడ్డి మాధవి, దిశా కమిటీ సభ్యులు బక్క శ్రీను, కొర్ర వెంకటేష్ నాయక్, జనగామ మున్సిపల్ చైర్పర్సన్ కడకంచి బాలమణి, ఘనపూర్ (స్టేషన్) మున్సిపల్ చైర్మన్ తాటికొండ వినయ్ కుమార్ హాజరయ్యారు.ఈ సమావేశంలో వరంగల్ ఎంపీ డా. కడియం కావ్య మాట్లాడుతూ జిల్లాలో విద్యార్థుల సంక్షేమం, నాణ్యమైన విద్య అందించడం, ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పన, విద్యా ప్రమాణాల మెరుగుదల కోసం జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా తీసుకుంటున్న ప్రత్యేక చొరవ అభినందనీయమని వరంగల్ పార్లమెంట్ సభ్యులు, దిశా కమిటీ చైర్ పర్సన్ డా.కడియం డా.కడియం కావ్య పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాల అమలుకు అవసరమైన ప్రతిపాదనలు వెంటనే సిద్ధం చేసి, అర్హులైన లబ్ధిదారులకు వాటి ప్రయోజనాలు అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు.ఎంపీ ల్యాడ్స్ నిధుల కింద మంజూరు చేసిన మూడు నెలల్లో పనులు ప్రారంభం కాకపోతే వెంటనే వాటిని రద్దు చేయాలని, వినియోగించిన నిధులను ఎప్పటికప్పుడు పోర్టల్‌లో నవీకరించాలని అధికారులను ఆదేశించారు.

వ్యవసాయంపై ప్రత్యేక దృష్టి

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిషేధించిన పారక్వాట్ గడ్డి మందు వినియోగాన్ని పూర్తిగా అరికట్టాలని, పారక్వాట్ వినియోగంపై కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.

విద్య, వైద్య రంగాలపై సూచనలు
పిల్లల్లో మానసిక వైకల్యాన్ని పాఠశాల స్థాయిలోనే గుర్తించే విధంగా ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని సూచించారు. మానసిక సమస్యలను తగ్గించేందుకు సరైన శిక్షణ, మార్గదర్శకత్వం అందించాలని చెప్పారు.విద్యార్థుల్లో రక్తహీనతను అంగన్‌వాడీ, ప్రీ-ప్రైమరీ దశ నుంచే గుర్తించాలని, పోషకాహారం, అవసరమైన మందులు అందించడంతో పాటు తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని సూచించారు. జాతీయ రహదారి--163లో మిస్సింగ్ సర్వీస్ రోడ్ల నిర్మాణ పురోగతిపై నేషనల్ హైవేస్ అధికారుల ద్వారా వివరణ అడిగి తెలుసుకున్నారు. రాఘవాపురం వద్ద వర్షపు నీరు జాతీయ రహదారిపై నిల్వ కాకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. చాగల్, ఘనపూర్, పెద్దపెండ్యాల ప్రాంతాల్లో నిర్మించిన సైడ్ డివైడర్లు ఉపయోగకరంగా లేవని పేర్కొని, వాటిని సరిచేయాలని ఆదేశించారు.

మాదకద్రవ్యాల నిర్మూలనకు కఠిన చర్యలు
జిల్లాలో మాదకద్రవ్యాలు, ఇతర మత్తు పదార్థాల వినియోగాన్ని పూర్తిగా అరికట్టాలని సూచించారు. అన్ని పాఠశాలల్లో తప్పనిసరిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని, గుడ్ టచ్-బ్యాడ్ టచ్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించాలని సూచించారు.జిల్లాలో ఇప్పటికే అమలు చేస్తున్న కార్యక్రమాలతో పాటు మరిన్ని వినూత్న ఆలోచనలను ప్రజలకు ప్రత్యక్షంగా ఉపయోగపడే కార్యక్రమాలకు శ్రీకారం చుట్టాలని సూచించారు. కొత్త కార్యక్రమాలను కేవలం ప్రారంభించడమే కాకుండా, వాటి ప్రయోజనాలు విస్తృతంగా ప్రజల్లోకి వెళ్లేలా సమర్థవంతమైన అవగాహన, ప్రచార కార్యక్రమాలు చేపట్టాలని పేర్కొన్నారు. ప్రజల భాగస్వామ్యంతోనే ప్రభుత్వ కార్యక్రమాలు విజయవంతమవుతాయని వెల్లడించారు.ఈ దిశా సమావేశంలో ఆర్డీఓలు గోపీరాం, కిరణ్ ప్రకాష్, మునిసిపల్ కమిషనర్లు రాజశేఖర్ రెడ్డి, రాధాకృష్ణ, అన్ని శాఖల జిల్లా అధికారులు, పోలీసు అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



పేద కుటుంబానికి అండగా నిలిచిన జిల్లా కలెక్టర్

మానవతా దృక్పథంతో స్పందించి ఇందిరమ్మ ఇల్లు మంజూరు

లబ్ధిదారురాలి ఇంటికి వెళ్లి ప్రొసీడింగ్స్ అందజేసిన మున్సిపల్ కమిషనర్

జనగామ, మన ప్రజాపక్షం:ం
వినాయక చవితి పర్వదినాన జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా మానవతా దృక్పథంతో స్పందించి ఓ పేద కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేసి అండగా నిలిచారు. పేద అర్హులైన కుటుంబాలకు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు సకాలంలో చేరేలా ప్రత్యేక చొరవ చూపుతున్న జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ప్రజా సంక్షేమం పట్ల నిబద్ధతకు మరో ఉదాహరణగా ఇందిరమ్మ ఇల్లు మంజూరు కార్యక్రమం నిలిచింది. జనగామ మున్సిపాలిటీ పరిధిలోని వీవర్స్ కాలనీకి చెందిన మామిడ్ల పద్మ ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షల ఆర్థిక సహాయం మంజూరు చేస్తూ జిల్లా కలెక్టర్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. లబ్ధిదారురాలు గతంలో ఇల్లు మంజూరైందనే నమ్మకంతో అప్పు చేసి తన సొంత స్థలంలో ఇంటి బేస్‌మెంట్ నిర్మించుకున్నారు. అయితే అవసరమైన ప్రక్రియలో సాంకేతిక సమస్యల కారణంగా నిర్మాణ దశ పోర్టల్‌లో నమోదు కాలేదు. జిల్లా కలెక్టర్ ఈ విషయాన్ని పరిశీలించి లబ్ధిదారురాలి అర్హతలను ధృవీకరించిన అనంతరం ఇందిరమ్మ ఇల్లు మంజూరుకు సానుకూలంగా నిర్ణయం తీసుకున్నారు.జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆదేశాల మేరకు జనగామ మున్సిపల్ కమిషనర్ రాజశేఖర్ రెడ్డి సోమవారం లబ్ధిదారురాలి ఇంటికి స్వయంగా వెళ్లి ప్రొసీడింగ్స్‌ను మామిడ్ల పద్మకు అందజేశారు.ఈ క్రమంలో ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద మంజూరైన రూ.5 లక్షల ఆర్థిక సహాయం ప్రభుత్వ నిబంధనల ప్రకారం నిర్మాణ దశల వారీగా లబ్ధిదారురాలి బ్యాంకు ఖాతాలో జమ కానుంది.అలాగే మున్సిపల్ కమిషనర్ ఇంటి నిర్మాణానికి అవసరమైన బిల్డింగ్ పర్మిషన్‌ను వెంటనే జారీ చేయడంతో పాటు వార్డు స్థాయి సిబ్బంది లబ్ధిదారురాలికి అవసరమైన ప్రక్రియలో సహకరించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఇందిరమ్మ సెక్షన్ ఇన్‌చార్జి జెస్సికా, కౌన్సిలర్ అనూష కృష్ణ పాల్గొన్నారు.ప్రజల సంక్షేమమే లక్ష్యంగా, అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు చేరేలా జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా మార్గదర్శకత్వంలో జిల్లా యంత్రాంగం ప్రజా సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తోంది.




వర్షాకాలంలో వరద నియంత్రణకు ప్రత్యేక బృందాలు

వర్షం కురుస్తున్న సమయంలో స్వయంగా క్షేత్రస్థాయిలో పర్యవేక్షించిన మున్సిపల్ కమిషనర్

జనగామ, మన ప్రజాపక్షం:
వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని జనగామ మున్సిపాలిటీ పరిధిలో వరద నీటి నియంత్రణ, నీటి నిల్వలు, డ్రైనేజీ సమస్యలు మరియు రోడ్లపై ఏర్పడే లీకేజీలను తక్షణమే పరిష్కరించేందుకు మున్సిపాలిటీ ప్రత్యేక చర్యలు చేపట్టింది.వర్షం కురుస్తున్న సమయంలో మున్సిపల్ కమిషనర్ రాజశేఖర్ రెడ్డి స్వయంగా పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో క్షేత్రస్థాయిలో పర్యటించి, వరద నీటి ప్రవాహం, డ్రైనేజీల పరిస్థితి, నీటి నిల్వలు మరియు ప్రజలకు ఎదురవుతున్న ఇబ్బందులను పరిశీలించారు. సంబంధిత సిబ్బందికి అవసరమైన సూచనలు చేస్తూ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఆదేశించారు.వర్షాల సమయంలో ఎక్కడైనా నీటి లీకేజీ, డ్రైనేజీ పొంగిపొర్లడం, నీరు నిలిచిపోవడం లేదా వరద నీటి ప్రవాహానికి ఆటంకం ఏర్పడినట్లు సమాచారం అందిన వెంటనే సంబంధిత ప్రత్యేక బృందాలు సంఘటనా స్థలానికి చేరుకుని చర్యలు చేపట్టే విధంగా ఏర్పాట్లు చేశారు.

24 గంటల్లో సమస్య పరిష్కారం
ప్రజల నుంచి అందే ఫిర్యాదులను నమోదు చేసి, సమస్య స్వభావాన్ని బట్టి గరిష్ఠంగా 24 గంటల్లో లీకేజీలు మరియు ఇతర అత్యవసర సమస్యలను పరిష్కరించేలా సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

ప్రత్యేక బృందాల ఏర్పాటు
వర్షాకాలంలో అత్యవసర పరిస్థితులకు తక్షణమే స్పందించేందుకు జనగామ మున్సిపాలిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక వరద నియంత్రణ మరియు అత్యవసర స్పందన బృందాలను ఏర్పాటు చేయడం జరిగింది. ఈ బృందాలు పట్టణంలోని సమస్యాత్మక ప్రాంతాలను నిరంతరం పర్యవేక్షిస్తూ వర్షాల సమయంలో ఏర్పడే సమస్యలపై వెంటనే స్పందించేలా చర్యలు తీసుకుంటాయి.ప్రజలు తమ ప్రాంతాల్లో నీటి నిల్వలు, డ్రైనేజీ సమస్యలు, లీకేజీలు లేదా వరద నీటి ప్రవాహానికి సంబంధించిన సమస్యలు గుర్తించిన వెంటనే మున్సిపాలిటీ దృష్టికి తీసుకురావాలని కమిషనర్ కోరారు.వర్షాకాలంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టడంతో పాటు సమస్య తలెత్తిన వెంటనే క్షేత్రస్థాయిలో స్పందించి పరిష్కరించడమే మున్సిపాలిటీ ప్రధాన లక్ష్యం అని మున్సిపల్ కమిషనర్ తెలిపారు.





బాలికల భద్రతకు గ్రామ పంచాయతీ పెద్దపీట

వట్టెం పాఠశాలలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసిన సర్పంచ్ పిట్టల జ్యోతి

బిజినపల్లి,మన ప్రజాపక్షం:
బాలికల భద్రతకు పెద్దపీట వేస్తూ వట్టెం గ్రామ పంచాయతీ అభినందనీయ నిర్ణయం తీసుకుంది.గ్రామంలోని బాలికల పాఠశాలలో విద్యార్థినుల భద్రత, పర్యవేక్షణ కోసం సర్పంచ్ పిట్టల జ్యోతి ఆధ్వర్యంలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. బాలికలకు సురక్షిత విద్యా వాతావరణం కల్పించాలనే ఉద్దేశంతో పాఠశాల ప్రధాన ద్వారం వద్ద పరిసర ప్రాంతాలు పూర్తిగా కవర్ అయ్యేలా కెమెరాను అమర్చారు. విద్యార్థినుల రాకపోకలు, పాఠశాల పరిసరాల్లో అనుమానాస్పద వ్యక్తుల కదలికలను గుర్తించడంతో పాటు అవాంఛనీయ ఘటనలు జరిగితే రికార్డుల ఆధారంగా విచారణకు ఉపయోగపడుతుందని తెలిపారు.ఈ సందర్భంగా సర్పంచ్ పిట్టల జ్యోతి శంకర్ మాట్లాడుతూ ఆడబిడ్డల భద్రత విషయంలో రాజీపడకూడదని, భయం లేని వాతావరణంలో విద్యను అందించాల్సిన బాధ్యత అందరిపై ఉందని అన్నారు. పాఠశాలలో సీసీ కెమెరా ఏర్పాటు పట్ల ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

వీర తెలంగాణ సాయుధ పోరాట స్ఫూర్తితో ప్రజా పోరాటాలను నిర్వహిస్తాం

సిపిఎం జిల్లా కార్యదర్శి వర్ధం పర్వతాలు



బిజినపల్లి, మన ప్రజాపక్షం:
వీర తెలంగాణ సాయుధ పోరాట స్ఫూర్తితో ప్రజా పోరాటాన్ని నిర్వహిస్తామని సాయుధ పోరాట చరిత్రను బిజెపి ఆర్ఎస్ఎస్ వక్రీకరించ పనిలో ఉందని సిపిఎం జిల్లా కార్యదర్శి పర్వతాలు విమర్శించారు.మంగళవారం బిజినపల్లి మండల కేంద్రంలో వీర తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాలను పురస్కరించుకొని బైక్ యాత్ర ప్రారంభించారు ఈ యాత్రను జండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కమ్యూనిస్టులు ఆంధ్ర మహాసభ కలిసి భూమి కోసం ముక్తి కోసం పేద ప్రజల విముక్తి కోసం సాయుధ రైతాంగ పోరాటాన్ని నిర్వహించారని, బాంచన్ నీ కాల్మొక్త అనే పరిస్థితి నుండి బంధువులు పట్టి సాయుధ పోరాటాన్ని నిర్వహించారని అన్నారు. దొడ్డి కొమరయ్య, చాకలి ఐలమ్మ, బందగి లాంటి అమరుల ప్రాణతర్పనంతో ప్రారంభమైన సాయుధ పోరాటం నైజామును గద్దె దింపేంతవరకు ఉద్యమించిందని అన్నారు. దొరలు జాకీర్దారులు నైజాం నవాబులు కలిసి పేద ప్రజానీకాన్ని చిత్రహింసలకు గురిచేస్తుంటే దానికి వ్యతిరేకంగా జరిగిన పోరాటాన్ని హిందూ ముస్లిం పోరాటంగా చిత్రీకరించడం దుర్మార్గమని, అలాంటి ప్రచారం చేస్తే చరిత్ర హీనులుగా ఆర్ఎస్ఎస్ బిజెపి మిగలాల్సి వస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఆర్. శ్రీనివాస్, జిల్లా కమిటీ సభ్యులు ఎం. శ్రీనివాస్, అశోక్, లక్ష్మణ్, రామయ్య, మధు, కాశన్న, భాస్కర్, సత్యనారాయణ,మల్లేష్, రమేష్,సుధాకర్,వెంకటేష్, శ్రీశైలం, శివరాం తదితరులు పాల్గొన్నారు.





అంగరంగ వైభవంగా పద్మశాలీల బోనాలు

జనగామ, మన ప్రజాపక్షం:
వినాయక చవితి మరుసటి రోజు పద్మశాలి కులబంధువులు అనవాయితీగా నిర్వహించుకుంటున్న బోనాల పండుగను భక్తిశ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు.ఈ సందర్భంగా పద్మశాలి కులబంధువులు అమ్మవారికి బోనాలు సమర్పించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. తరతరాలుగా వస్తున్న ఈ సంప్రదాయాన్ని కొనసాగిస్తూ, మన సంస్కృతి, ఆచారాలు, ఐక్యతను కాపాడుకోవడం ఎంతో గొప్ప విషయమని తెలిపారు.పద్మశాలి సమాజంలోని ప్రతి కుటుంబం సుఖసంతోషాలతో,ఆయురారోగ్యాలతో ఉండాలని సమాజం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని అమ్మవారిని ప్రార్థించారు.వినాయక చవితి అనంతరం మరుసటి రోజు నిర్వహించే ఈ బోనాల పండుగ పద్మశాలి కులబంధువుల ఐక్యతకు, సంప్రదాయానికి ప్రతీకగా నిలుస్తుందని తెలిపారు.ఈ సందర్భంగా పద్మశాలి కులబంధువులందరికీ బోనాల పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో జనగామ పోపా ప్రధాన కార్యదర్శి మదాసు ఎల్లయ్య, జనగామ పోపా అధికార ప్రతినిధి పిట్టల సతీష్, బూరెల వెంకటేశ్వర్లు, లగిశెట్టి ప్రభాకర్,మదాసు శ్రీకాంత్,లోక విఠల్, గర్దాస్ సంతోష్, లాగిశెట్టి రమాకాంత్, పిట్టల రవీందర్,అందే సోమనరయ్య, చింతకింది సతీష్, లోక ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీనివాస కాలనీలో కొలువుదీరిన గణనాథుడు



అచ్చంపేట, మన ప్రజాపక్షం:అచ్చంపేట పట్టణంలోని పదో వార్డు శ్రీనివాస కాలనీలో కాలనీవాసులందరూ కలిసి అందమైన వినాయక మండపాన్ని నిర్మించి సుమారు 9 అడుగుల గణనాథుని రంగురంగుల పుష్పాలు, దీపాలంకరణలు, మామిడి ఆకుల తోరణాల మధ్యన సరిగా 11:40 నిమిషాలకు భద్రపద మాసము శుక్ల చత్తార్థి మధ్యాహ్నం శుభ సమయంలో హస్త నక్షత్రం రోజున గణనాథుని అంగరంగ వైభవంగా వేదమంత్రోచ్ఛారణల మధ్య ప్రతిష్టించామని కాలనీ అధ్యక్షులు ప్రతాపరెడ్డి మరియు గణేష్ ఉత్సవ కమిటీ చైర్మన్ జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహిత మంతటి నారాయణ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ విధంగా వినాయక ఉత్సవాలను ఆరు రోజుల పాటు ఘనంగా నిర్వహిస్తున్నామని అన్నారు. ప్రతి రోజు స్వామివారి సన్నిధిలో పూజా కార్యక్రమాలు మరియు అన్నదాన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. పూజా కార్యక్రమం అయిన తర్వాత మహిళలచే కోలాటం,చప్పట్లు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. మొదటి రోజు పూజా కార్యక్రమంలో మంతటి నారాయణ రమణ దంపతులు మరియు సున్నం కృష్ణయ్య మల్లిశ్వరి దంపతులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో లక్ష్మారెడ్డి, తిరుపతిరెడ్డి,రవి, వెంకటేశ్వర్లు, సున్నం కృష్ణయ్య, అంజనేయులు, రామచంద్రయ్య, విష్ణు, శేఖర్, సాయిలు, చంద్రశేఖర్,రవీందర్, సైదులు, బాలకృష్ణ, బాలకిష్టయ్య, రాజశేఖర్,మాధవి,చంద్రకళ,మంజుల, మల్లీశ్వరి, మంతటి రమణ, కృష్ణవేణి, ఉమా,భాగ్య లక్ష్మి, వర్ణ శ్రీ తదితర కాలనివాసులు పాల్గొన్నారు.

జనగామ అభివృద్ధికి 'దిశా' నిర్దేశం

ఎంపీ కడియం కావ్యకు నాగరత్న సేవా సంఘం వినతి



జనగామ, మన ప్రజాపక్షం:
జనగామ కలెక్టరేట్‌లో వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు, దిశా కమిటీ చైర్మన్ డాక్టర్ కడియం కావ్యను నాగరత్న సేవా సంఘం అధ్యక్షుడు బిర్రు ఇస్తారి ఆధ్వర్యంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎంపీని చేనేత శాలువాతో ఘనంగా సన్మానించిన అనంతరం, జనగామ నియోజకవర్గ అభివృద్ధికి సంబంధించి విద్యా, వైద్య రంగాలు మరియు పరిశ్రమల అభివృద్ధి సాధనకై పలు కీలక డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ?ఈ వినతిపత్రంలో ప్రధానంగా జనగామకు మంజూరైన 'ఏటీసీ' (అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్) పనులకు త్వరగా శంకుస్థాపన చేయాలని కోరారు. వీటితో పాటు జనగామ ప్రాంతానికి కాకతీయ ఇంజనీరింగ్ కాలేజ్, యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ హైస్కూల్, తెలంగాణ పబ్లిక్ స్కూల్, కేంద్రీయ విద్యాలయం, నవోదయ విద్యాలయం మరియు అంబేద్కర్ నాలెడ్జ్ సెంటర్ వంటి ప్రముఖ విద్యాసంస్థలను మంజూరు చేయాలని ఎంపీకి విజ్ఞప్తి చేశారు.?అలాగే స్థానిక ఏరియా ఆసుపత్రిలో ఎంఆర్ఐ స్కానింగ్ సదుపాయంతో పాటు, గుండె సంబంధిత 2ణ ఎకో పరీక్షలు, క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు ఉచితంగా అందేలా సంబంధిత వైద్యులను, పరికరాలను అందుబాటులోకి తేవలసిందిగా కోరారు. లింగాల గణపురం మండలంలోని కళ్లెం గ్రామంలో టెక్స్‌టైల్ పార్క్ ఏర్పాటు విషయమై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లి తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

గిన్నిస్ వరల్డ్ రికార్డ్‌లో మెరిసిన జనగామ కరాటే మాస్టర్లు కాసర్ల కార్తీక్, సోనియా

ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న ప్రత్యేక అభినందనలు!



జనగామ, మన ప్రజాపక్షం:
హైదరాబాద్‌లోని గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో ఏప్రిల్ 26న నిర్వహించిన ప్రపంచంలోనే అతిపెద్ద 'కరాటే కటా'ప్రదర్శనలో జనగామ జిల్లాకు చెందిన ఫైటర్స్ షోటోకాన్ కరాటే అకాడమీ వ్యవస్థాపకులు మాస్టర్ కాసర్ల కార్తీక్ మరియు మాస్టర్ సోనియా గిన్నిస్ వరల్డ్ రికార్డు సాధించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వీరు 25 నిమిషాల పాటు నిరంతరాయంగా కటా ప్రదర్శన చేసి ఈ అరుదైన ఘనతను తమ సొంతం చేసుకున్నారు. ?గిన్నిస్ వరల్డ్ రికార్డు నెలకొల్పిన కరాటే మాస్టర్లు కాసర్ల కార్తీక్, సోనియాలను టిఆర్‌పి అధ్యక్షులు, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో టిఆర్‌పి రాష్ట్ర విద్యార్థి విభాగం అధ్యక్షులు పిట్టల సురేష్ కూడా పాల్గొని, విజేతలకు తమ శుభాకాంక్షలు తెలియజేశారు.?ఈ సందర్భంగా ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న మాట్లాడుతూ మన జనగామ నియోజకవర్గానికి చెందిన క్రీడాకారులు అంతర్జాతీయ స్థాయిలో ప్రతిభ చాటి గిన్నిస్ రికార్డు సాధించడం ఎంతో గర్వకారణమని కొనియాడారు. భవిష్యత్తులో వీరు మరిన్ని జాతీయ, అంతర్జాతీయ స్థాయి పోటీలలో విజయాలు సాధించి దేశానికి, రాష్ట్రానికి అలాగే జనగామ నియోజకవర్గానికి మరింత మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.



విద్యార్థులకు స్కూల్ యూనిఫామ్ పంపిణీ

చిలుకూరు,మన ప్రజాపక్షం:
మండలంలోని ఆచార్యుల గూడెం హై స్కూల్లో విద్యార్థులకు ప్రభుత్వం నుండి వచ్చే యూనిఫామును సర్పంచ్ బొడ్డుపల్లి లక్ష్మీ బిక్షం చేతుల మీదుగా మంగళవారం విద్యార్థులకు యూనిఫాం పంపిణీ చేయటం జరిగింది. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ విద్యార్థుల్లో క్రమశిక్షణ, సమానత్వ భావన పెంపొందించడంలో యూనిఫాం ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు.విద్యార్థులకు అవసరమైన సౌకర్యాలు కల్పిస్తూ వారి విద్యాభివృద్ధికి ప్రభుత్వం చేస్తున్న కృషిని అభినందించారు.యూనిఫాంలు అందుకున్న విద్యార్థులు సంతోషం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో పాలకవర్గ సభ్యులు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు మరియు గ్రామ పెద్దలు పాల్గొన్నారు.



ఘనంగా శాంతిరామ్ ఇంజనీరింగ్ కళాశాలలో ఇంజనీర్ల దినోత్సవ వేడుకలు

పాణ్యం, మన ప్రజాపక్షం:
శాంతిరామ్ ఇంజనీరింగ్ కళాశాలలో సెప్టెంబర్ 15న భారతరత్న సర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతిని పురస్కరించుకుని ఇంజనీర్ల దినోత్సవం వైభవంగా నిర్వహించారు.చైర్మన్ డాక్టర్ ఎం.శాంతిరాముడు, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.వి.సుబ్రమణ్యం ముఖ్య అతిథులుగా హాజరై అధ్యాపకులకు శుభాకాంక్షలు తెలియజేశారు.కార్యక్రమంలో సర్ ఎం.విశ్వేశ్వరయ్య చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి, ఆయన సేవలను స్మరించారు.డీన్ డాక్టర్ జి.సౌమ్య ఆర్ ఇంజనీర్స్ డే ప్రాముఖ్యతను వివరించి, అధ్యాపక బృందం కృషిని అభినందించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.వి.సుబ్రమణ్యం విద్యా నైపుణ్యం, పరిశోధన, ఆవిష్కరణలపై అధ్యాపకుల దృష్టిని సూచించారు. చైర్మన్ డాక్టర్ ఎం.శాంతిరాముడు ఆధునిక సమాజంలో ఇంజనీర్ల పాత్రను ప్రస్తావించి, అధ్యాపకుల కృషిని ప్రోత్సహించారు. ఈ వేడుకలో 71 అధ్యాపకులు చేసిన సేవలకు ప్రోత్సాహకాలు పంపిణీ చేశారు.సంస్థ యాజమాన్యం, ప్రముఖులు, అధ్యాపకులు ఈ కార్యక్రమానికి హాజరై కృతజ్ఞతలు తెలిపారు.

గణేష్ నిమజ్జనానికి పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి: జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్

ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు చర్యలు

డీజేలకు అనుమతి లేదు...నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు



నారాయణపేట, మన ప్రజాపక్షం:
నారాయణపేట జిల్లాలో గణేష్ నిమజ్జన కార్యక్రమాలను ప్రశాంతంగా, సురక్షితంగా నిర్వహించేందుకు పకడ్బందీ బందోబస్తు ఏర్పాటు చేయాలని జిల్లా ఎస్పీ డాక్టర్ జి. వినీత్ పోలీసు అధికారులను ఆదేశించారు.జిల్లా పోలీసు కార్యాలయంలోనీ కాన్ఫరెన్స్ హాల్లో గణేష్ నిమజ్జన శోభయతల సందర్భంగా పోలీసు అధికారులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలో మొత్తం 1,509 గణేష్ విగ్రహాలు ఉండగా, అధిక సంఖ్యలో నిమజ్జనాలు గణేష్ ప్రతిష్టాపన నుండి 03, 05, 07, 09, 11 రోజులలో జరిగే అవకాశం ఉన్నందున అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎట్టి పరిస్థితుల్లో డీజేలకు అనుమతి లేదు అని ముందస్తు డీజేల ఓనర్లను బైండోవర్ చేయాలని, ఇతర జిల్లాలు, కర్ణాటక నుండి రాకుండా చెక్ పోస్టులు ఏర్పాటు చేయాలని సూచించారు. ఎవరైనా అల్లర్లు సృష్టించాలని చూస్తే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని తెలిపారు. రౌడీ షీటర్స్, కమ్యునల్ షీటర్స్, సస్పెక్ట్ షీటర్స్ పై నిఘా ఉంచాలి. కొండారెడ్డిపల్లి చెరువు, కృష్ణా నది, జూరాల డ్యాం, మక్తల్ ట్యాంక్ బండ్, కోయిల్ సాగర్ తదితర నిమజ్జన ప్రాంతాల్లో ముందస్తు ఏర్పాట్లు చేయాలన్నారు.చెరువుల వద్ద క్రేన్లు, లైటింగ్, లైఫ్ జాకెట్లు, గజ ఈతగాళ్లు, ఫైర్ సిబ్బంది, టార్చ్ లైట్లు అందుబాటులో ఉంచాలని, శోభాయాత్ర రూట్లలో సీసీ కెమెరాలు, వీడియో గ్రఫీ, ట్రాఫిక్ డైవర్షన్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు.చిన్నపిల్లలు, వృద్ధులు నీటి ప్రాంతాలకు వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవడంతో పాటు, మద్యం సేవించి వాహనాలు నడపకుండా ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని తెలిపారు. నిమజ్జనం పూర్తయ్యే వరకు పోలీసు సిబ్బంది అప్రమత్తంగా విధులు నిర్వహించాలని ఎస్పీ సూచించారు. అలాగే సోషల్ మీడియా ఫేస్బుక్, వాట్సప్, ట్విట్టర్, ఇంస్టాగ్రామ్ లపై పూర్తి స్థాయిలో నిఘా ఉంచాలి అని తెలిపారు.ఈ సమావేశంలో అదనపు ఎస్పీ ఎం.డి.రియాజ్ ఉల్ హక్, డీఎస్పీలు మహేష్, నల్లపు లింగయ్య, సీఐలు శివశంకర్, రామ్ లాల్, భగవంత్ రెడ్డి, సైదులు, ఆర్ఐ విజయ్ భాస్కర్, ఎస్సైలు భాగ్యలక్ష్మీ రెడ్డి, వెంకటేశ్వర్లు, సతీష్ రెడ్డి, నరేష్, రాజు, రమేష్, అశోక్ బాబు, ఎస్.ఎం నవీద్, మహేశ్వరి పాల్గొన్నారు.



గురుకుల ప్రాంగణంలో కొలువుదీరిన గణనాథుడు

భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహిస్తున్న విద్యార్థులు

ఆత్మకూరు(ఎస్), మన ప్రజాపక్షం:
సూర్యాపేట జిల్లా ఆత్మకూర్ (ఎస్) మండల పరిధిలోని మహాత్మ జ్యోతిబా ఫూలే తెలంగాణ వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల పాఠశాలలో వినాయక చవితి నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. పాఠశాల ప్రాంగణంలో గణనాథుడి విగ్రహాన్ని ఏర్పాటు చేసి విద్యార్థులు ప్రతిరోజూ ప్రత్యేక పూజలు నిర్వహిస్తూ ఆధ్యాత్మిక వాతావరణాన్ని నెలకొల్పారు. విద్యార్థులు భక్తితో గణపతిని పూజిస్తూ, నవరాత్రి ఉత్సవాల్లో ఉత్సాహంగా పాల్గొంటున్నారు. విద్యతోపాటు విద్యార్థుల్లో దైవభక్తి, ఆధ్యాత్మిక విలువలు, సంస్కృతి, సంప్రదాయాల పట్ల గౌరవాన్ని పెంపొందించేలా పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, సిబ్బంది సహకరించడం అభినందనీయమని పలువురు విద్యార్థుల తల్లిదండ్రులు పేర్కొన్నారు. పాఠశాలలో ఆధ్యాత్మిక వాతావరణాన్ని కల్పించి, విద్యార్థులను సంప్రదాయ వేడుకల్లో భాగస్వాములను చేస్తున్న ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, సిబ్బందికి తల్లిదండ్రులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. విద్యార్థులకు పాఠ్యాంశాల బోధనతో పాటు మంచి విలువలు, క్రమశిక్షణ, దైవభక్తి, సంస్కృతి పట్ల అవగాహన కల్పించడం వారి సమగ్ర అభివృద్ధికి దోహదపడుతుందని వారు అభిప్రాయపడ్డారు. నవరాత్రి ఉత్సవాలను విద్యార్థులు ఆనందోత్సాహాలతో నిర్వహించుకుంటుండటంతో పాఠశాల ప్రాంగణం భక్తి వాతావరణంతో కళకళలాడుతోంది.



తెలంగాణకు పట్టిన పీడ కాంగ్రెస్ దయ్యమే

మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీశ్ రెడ్డి

సూర్యాపేట, మన ప్రజాపక్షం:
రైతుల పట్ల కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరుపై మండిపడుతూ సూర్యాపేట జిల్లా కేంద్రంలోని క్యాంపు కార్యాలయంలో మాజీ మంత్రి, సూర్యాపేట శాసనసభ్యులు గుంటకండ్ల జగదీష్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ తెలంగాణకు పట్టిన పీడ కాంగ్రెస్ దయ్యమే అని,రేవంత్ అనే భూతం ఈ రాష్ట్రాన్ని నాశనం చేస్తుందన్నారు.అందుకే తెలంగాణాలో నీళ్లు, అభివృద్ధి కుంటుబడినాయన్నారు.ప్రజలు ఏమడిగినా ఎల్లినో సాకుతో కాంగ్రెస్ నాయకులు తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నారని ఏద్దేవా చేశారు.కన్నెపల్లి పంపుహౌజ్ ఇవ్వాళ ప్రారంభించిన నీళ్లు సిద్ధంగా ఉన్నాయన్నారు.సాగర్ ఎడమ కాలువ ద్వారా 11 వేల క్యూసెక్కుల నీళ్లు ఇచ్చే పరిస్థితి వున్నా కేవలం 7 వేల క్యూ సెక్కులు మాత్రమే ఇస్తున్నారన్నారు.రైతులు పంటలు వేసుకోవాలా వద్దా అని స్పష్టంగా చెప్పమంటే సమాధానమే లేదన్నారు.మన నీళ్లను దోచుకుపోతుంటే కేఆర్ఎంబికి ఉత్తరం రాయాలన్న సోయికూడా ఈ ప్రభుత్వానికి లేదన్నారు.ఇంతకన్నా తక్కువ నీళ్ళున్న సమయంలోనే పంటలు బ్రహ్మాండంగా పండించుకున్నామన్నారు.ఆనాడే వాళ్ల బాసులైనా చంద్రబాబు మెడలు వంచి తెలంగాణను సస్యశ్యామలం చేసుకున్నాం అని,కృష్ణా, గోదావరి నీళ్లు పుష్కలంగా వచ్చినా పంటలు ఎండబెడుతుండ్రు అని ఆవేదన వ్యక్తం చేశారు.కండ్లముందే ఆంధ్రకు నీళ్లు దోచుకుపోతుంటే కాబోదుల్లా ఇక్కడి సీఎం, మంత్రులు వ్యవహరిస్తున్నరని పంటలు పండనియొద్దనే కాంగ్రెస్ ప్రభుత్వం కక్షగట్టిందన్నారు.పంటలు పండితే నీళ్లు, కరెంటు, బోనస్ లు ఇవ్వాల్సివస్తదనే కుట్రలు చేసిండ్రని,రైతుల పట్ల నిర్లక్ష్యం, నిర్లజ్జగా వ్యవహరిస్తున్నారన్నారు.కెసిఆర్ ఆనాడే పాదయాత్ర చేసి పంటలు కాపాడిండన్నారు.ఇవ్వాళ రైతుల తరుపున ఎటువంటి పోరాటానికైనా కెటిఆర్ సిద్ధంగా ఉన్నాడని,ఒక్క ఎకరం కూడా ఎండనీయ్యొద్దని మిర్యాలగూడ రైతు ధర్నాలో కెటిఆర్ స్పష్టంగా చెప్పిండన్నారు.మరొమారు పాదయాత్రలు చేసైనా సరే రైతుల పంటలు ఎండకుండా పోరాడతాం అన్నారు.

పట్టుదల ముందు పేదరికం ఓడిపోయింది



నకిరేకల్,మన ప్రజాపక్షం
:పేదరికం ముందు ఎన్నో కలలు ఆగిపోతాయి కానీ పట్టుదల ముందు పేదరికమే ఓడిపోయింది!.నకిరేకల్‌కు చెందిన మౌలానా అక్బర్ కుమారుడు అబూబకర్ సిద్ధిఖ్ విద్యకు పేదరికం అడ్డు కాదని నిరూపించాడు.తండ్రి మౌలానా అక్బర్ గతేడాది మృతి చెందినప్పటికి ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న కుటుంబం నుంచి వచ్చినా చదువే తన లక్ష్యంగా ముందుకు సాగాడు.తండ్రి లేని ఆ లోటును అధిగమిస్తూ కుటుంబ పరిస్థితులు ఏమాత్రం తన లక్ష్యానికి అడ్డంకి కాకుండా గట్టి పట్టుదలతో చదువుపై దృష్టి సారించాడు."నీట్"లో 552 మార్కులు సాధించి ప్రతిష్ఠాత్మక ఉస్మానియా మెడికల్ కాలేజీలో మెడిసిన్ సీటు సాధించాడు.ఇది కేవలం ఓ విద్యార్థి సాధించిన విజయం కాదు..పేదరికాన్ని జయించిన పట్టుదలకు దక్కిన గెలుపు అంటూ పలువురు అభినందిస్తున్నారు.చదువుకోవాల నే సంకల్పం ఉంటే ఆర్థిక పరిస్థితులు అడ్డంకులు కావని నిరూపించిన అబూబకర్ సిద్ధిఖ్ విజయగాథ ఎంతోమంది పేద విద్యార్థులకు స్ఫూర్తిగా నిలుస్తుందని మేధావులు కొనియాడుతున్నారు.



ఘనంగా ఏఐఎస్ఎఫ్ జనగామ జిల్లా 3వ మహాసభ

స్టేషన్ ఘన్‌పూర్,మన ప్రజాపక్షం:అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) జనగామ జిల్లా 3వ మహాసభ స్టేషన్ ఘన్‌పూర్‌లో ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ మాజీ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ సయ్యద్ వలీ ఉల్లా ఖాద్రి జెండాను ఆవిష్కరించారు.మహాసభను ఉద్దేశించి ఏఐఎస్ఎఫ్ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి కామ్రేడ్ పుట్ట లక్ష్మణ్ మాట్లాడుతూ విద్యారంగంపై ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలు, ప్రభుత్వ విద్యారంగాన్ని బలహీనపరిచే కుట్రలను తీవ్రంగా వ్యతిరేకించాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. విద్యార్థుల హక్కులు, ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణ కోసం ఏఐఎస్ఎఫ్ నిరంతరం పోరాటం కొనసాగిస్తుందని తెలిపారు.అలాగే జిఓ నెం. 97ను రద్దు చేయాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి డాక్టర్ గ్యార నరేష్ డిమాండ్ చేశారు.విద్యార్థుల ప్రయోజనాలకు విరుద్ధంగా ఉన్న నిర్ణయాలను ప్రభుత్వం వెంటనే పునఃపరిశీలించాలని కోరారు.ఈ మహాసభ మహమ్మద్ యూనుస్ అధ్యక్షతన జరిగింది. ఏఐఎస్ఎఫ్ జనగామ జిల్లా మాజీ నాయకులు మహమ్మద్ రహమతుల్లా, ప్రస్తుత నాయకులు పృథ్వీరాజ్, అక్షయ్ జీవన్, దామెర రాము, బుస్సా రోహిత్, చింత నిఖిల్ తో పాటు పలువురు విద్యార్థులు పాల్గొన్నారు. విద్యార్థుల సమస్యల పరిష్కారం, ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణ, విద్యార్థుల హక్కుల సాధన కోసం ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో మరింత బలమైన ఉద్యమాలను చేపట్టాలని మహాసభ పిలుపునిచ్చింది.



జూనియర్ కబడ్డీ సెలక్షన్‌లో క్రీడాకారులకు ప్రోత్సాహం

జనగామ, మన ప్రజాపక్షం:
జనగామ జిల్లాలో నిర్వహించిన జూనియర్ కబడ్డీ సెలక్షన్ కార్యక్రమంలో జనగామ మున్సిపల్ చైర్‌పర్సన్ కడకంచి బాలమణి శ్రీనివాస్ పాల్గొని క్రీడాకారులను ప్రోత్సహించారు.ఈ సందర్భంగా బాలురు, బాలికలు ఉత్సాహంగా సెలక్షన్‌లో పాల్గొనడం ఆనందంగా ఉందని చైర్‌పర్సన్ పేర్కొన్నారు. క్రీడలతో యువతలో క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం పెంపొందుతాయని తెలిపారు. సెలక్షన్‌లో పాల్గొన్న క్రీడాకారులందరికీ ఆమె హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు, క్రీడాకారులు, ఎన్ ఎస్ యు ఐ ప్రెసిడెంట్, నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.



సెప్టెంబర్ 19న మెగా జాబ్ మేళా ఏర్పాట్లపై అధికారులకు దిశానిర్దేశం

జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్

కోదాడ, మన ప్రజాపక్షం:సెప్టెంబర్ 19న సూర్యాపేట జిల్లా కోదాడలో నిర్వహించనున్న మెగా జాబ్ మేళా ఏర్పాట్లపై మంగళవారం కోదాడలోని సీసీ రెడ్డి కాన్వెంట్‌లో జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జాబ్ మేళాకు హాజరయ్యే నిరుద్యోగ యువతకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. అభ్యర్థుల రిజిస్ట్రేషన్, కంపెనీల ప్రతినిధులకు అవసరమైన సౌకర్యాలు, వాహనాల పార్కింగ్, తాగునీరు, భద్రత, ట్రాఫిక్ నియంత్రణ తదితర అంశాలపై సమీక్షించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జాబ్ మేళాకు పెద్ద సంఖ్యలో యువత హాజరయ్యే అవకాశం ఉన్నందున శాఖల వారీగా బాధ్యతలు కేటాయించి సమన్వయంతో పనిచేయాలని అధికారులను సూచించారు. అర్హత కలిగిన ప్రతి నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు అందేలా జాబ్ మేళాను విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని చర్యలు తీసుకోవాలని తెలిపారు.ఈ సమీక్ష సమావేశంలో కోదాడ ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతి రెడ్డి,జిల్లా ఎస్పీ కే.నరసింహ, కోదాడ ఆర్డిఓ సూర్యనారాయణ, మున్సిపల్ కమిషనర్ రమాదేవి,వివిధ శాఖలకు చెందిన అధికారులు తదితరులు పాల్గొన్నారు.

దీపావళి నాటికి వరంగల్‌లో సీజీహెచ్ఎస్ వెల్‌నెస్ సెంటర్ వైద్య సేవలు అందుబాటులోకి

12 వేల మంది కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు వైద్య సేవలు అందుబాటులోకి

సీజీహెచ్ఎస్ అదనపు డీజీతో కలిసి ప్రతిపాదిత భవనాలను పరిశీలించిన ఎంపీ

ఎంపీ చొరవతో వేగంగా వెల్ నెస్ సెంటర్ పనులు



జనగామ ప్రతినిధి, మన ప్రజాపక్షం:
వరంగల్ నగరంలో సెంట్రల్ గవర్నమెంట్ హెల్త్ స్కీమ్ (సిజిహెచ్ఎస్) వెల్‌నెస్ సెంటర్ ఏర్పాటుకు ప్రక్రియ వేగవంతమైంది. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లు, రిటైర్డ్ ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులకు మెరుగైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య చేసిన నిరంతర కృషికి అనుగుణంగా అధికారులు చర్యలు చేపడుతున్నారు.ఇందులో భాగంగా సోమవారం సిజిహెచ్ఎస్, కేంద్ర ఆరోగ్య-కుటుంబ సంక్షేమ శాఖ అదనపు డైరెక్టర్ జనరల్ డాక్టర్ పర్వీన్ బాలా, సిజిహెచ్ఎస్ వైద్య బృందంతో కలిసి వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య కేయూ క్రాస్ సమీపంలోని ఆకాశవాణి రేడియో స్టేషన్ ప్రాంగణంలోని ప్రతిపాదిత భవనాలను పరిశీలించారు. వెల్‌నెస్ సెంటర్ ఏర్పాటుకు అనువైన వసతులు, భవన పరిస్థితి, అవసరమైన మౌలిక సదుపాయాలను పరిశీలించారు.వెల్‌నెస్ సెంటర్ ఏర్పాటుకు సంబంధించిన ప్రతిపాదన ఆర్థిక అనుమతి కోసం కేంద్ర ఆరోగ్య-కుటుంబ సంక్షేమ శాఖ వద్ద పెండింగ్‌లో ఉన్న విషయాన్ని గుర్తించిన ఎంపీ, ఇటీవల మరోసారి ఢిల్లీలో కేంద్ర ఆరోగ్య-కుటుంబ సంక్షేమ శాఖ కార్యదర్శిని కలిసి విజ్ఞప్తి చేశారు.. పెండింగ్‌లో ఉన్న ఆర్థిక అనుమతిని త్వరితగతిన మంజూరు చేసి, మిగిలిన ప్రక్రియను పూర్తి చేయాలని విజ్ఞప్తి చేశారు. అందులో భాగంగానే నేడు కేంద్ర బృందం తో కలిసి ఎంపీ వెల్ నెస్ సెంటర్ ను సందర్శించడం జరిగింది.

దీపావళి నాటికి సీజీహెచ్ఎస్ వెల్‌నెస్ సెంటర్ వైద్య సేవలు అందుబాటులోకి

తాజాగా అధికారుల బృందంతో కలిసి భవనాలను పరిశీలించిన వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య, దీపావళి నాటికి సిజిహెచ్ఎస్ వెల్‌నెస్ సెంటర్ వైద్య సేవలు అందుబాటులోకి తీసుకువచ్చే విధంగా చర్యలు చేపట్టాలని అధికారులను కోరారు. అవసరమైన మౌలిక వసతులు, వైద్య సదుపాయాలు, ఇతర ఏర్పాట్లను వేగంగా పూర్తి చేయాలని సూచించారు. వెల్‌నెస్ సెంటర్ ఏర్పాటుకు తన ఎంపీ నిధుల నుంచి 10 లక్షలు అందించేందుకు సిద్ధంగా ఉన్నట్లు ఎంపీ తెలిపారు.

కార్పొరేట్ స్థాయి వైద్య సేవలు లక్ష్యం

వరంగల్‌లో ఏర్పాటు కానున్న సిజిహెచ్ఎస్ వెల్‌నెస్ సెంటర్‌ను కేవలం ప్రాథమిక వైద్య సేవలకు పరిమితం కాకుండా కార్పొరేట్ స్థాయి వైద్య సేవలు అందించే విధంగా అభివృద్ధి చేయాలన్నదే తన లక్ష్యమని వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య పేర్కొన్నారు.ఇక్కడ ఓపీ సేవలతో పాటు అవసరమైన వైద్య పరీక్షలు, మందులు, వివిధ రకాల చికిత్సలు, శస్త్రచికిత్సలకు సంబంధించి రిఫరల్ సదుపాయాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఇప్పటికే మెడికవర్, లెనోవా ఆసుపత్రులతో ఎంప్యానల్‌మెంట్/అనుబంధ ప్రక్రియ ఉన్నట్లు తెలిపారు. తద్వారా వరంగల్, హనుమకొండతో పాటు పరిసర ప్రాంతాల్లో సుమారు 12 వేల మంది కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లు, రిటైర్డ్ ఉద్యోగులు, వారి ఆధారిత కుటుంబ సభ్యులకు నాణ్యమైన వైద్యం అందుబాటులోకి వస్తుందని వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య స్పష్టం చేశారు.



రియల్ ఎస్టేట్ చేతుల్లో వెంచర్లుగా మారిపోతున్న చెరువులు

తిరుమలగిరి,మన ప్రజాపక్షం: తిరుమలగిరి మండలంలో రియల్ ఎస్టేట్ చేతుల్లో వెంచర్లుగా మారిపోతున్న చెరువులను కాపాడాలని జిఎంపిఎస్ సూర్యాపేట జిల్లా అధ్యక్షులు కడెం లింగయ్య అధికారులను కోరారు.తిరుమలగిరిలో ఉన్న చెరువులన్నీ అన్యాక్రాంతమవుతుందని అక్రమాలకు గురవుతున్నాయని రెవెన్యూ, సంబంధిత అధికారుల దృష్టికి అనేక దఫాలుగా సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో తీసుకపోయినా నిమ్మకు నీరెత్తినట్లైనా లేదు అని అన్నారు.తిరుమలగిరి పెద్ద చెరువు 196 ఎకరాల ఒక గుంట,నల్లగుంట ఇరవై ఒక్క ఎకరం 17 గుంటలు,ఎర్రగుంట 12 ఎకరాల 38 గుంటలు,దయ పోసుకుంటా ఆరు ఎకరాల 39 గుంటలు, కొచ్చేరు 24 ఎకరాల 24 గుంటలు,తిరుమలైకుంట 26 ఎకరాల 24 గుంటలు,గార్లకుంట 13 ఎకరాల మూడు గుంటలు..దీంట్లో కనుమరుగైన చెరువులు దయ పోషకుంట, ఓడ్లోని కుంట, మొండికుంట ఈ చెరువుల జాడే లేదని పైన చూపబడిన చెరువులన్నీ వీలున్న మేరకు రియల్ ఎస్టేట్ కబంధ హస్తాలతో మాయమైపోతున్నాయని అన్నారు.తిరుమలగిరి మండల కేంద్రంలో దిన దినము రియల్ ఎస్టేట్ పెరుగుతున్నకొద్ది చెరువు శిఖాల, భూములు కరిగిపోతున్నాయి.చెరువులన్నిటికీ హద్దులు పెట్టి ఫినిషింగ్ చేయించాలని రెవెన్యూ అధికారులకు చెప్పితే రెవిన్యూ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లైనా లేరు ఒకపక్క చెరువు శిఖాలలలో బోర్లు వేసి పొలాలను అచ్చు కట్టుకొని కొంతమంది రైతులు కబ్జా పెట్టుకున్నారు.మనమందరము చూస్తుండగానే అనేక చెరువు శికాల భూములు అన్యాక్రాంతం గురవుతున్నాయి రానున్న కాలంలో నీటి ఎద్దడి పెరగటంతో పాటు ప్రభుత్వ అవసరాలకు వాడుకోవడానికి జాగా కూడా మిగిలిన పరిస్థితి ఏర్పడిన ఉన్నదని అన్నారు తిరుమలగిరి మండల కేంద్రంలో ఉన్నది రెవిన్యూ అధికారులు తక్షణమే స్పందించి చెరువు శికాల భూములను కబ్జా చేసిన వారిపై చట్టపరమైన చర్య తీసుకుని, ఆ భూములను పరిరక్షించవలసిన బాధ్యత అధికారులపై ఉన్నదన్నారు.తక్షణమే చర్య తీసుకొని ఉన్న చెరువులన్నీటికి హద్దురాలు నాటి, ఫినిషింగ్ చెయ్యకపోతే సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో అనేక ఆందోళన కార్యక్రమాలు చేపట్టవలసి వస్తున్నదని, పార్టీ హెచ్చరిస్తానే ఉంటుందన్నారు.



గణేష్ మండపాల నిర్వాహకులు అప్రమత్తంగా ఉండాలి: సీఐ శివశంకర్

నారాయణపేట, మన ప్రజాపక్షం:నారాయణపేట జిల్లా కేంద్రంలోని సుభాష్ రోడ్‌లో ఏర్పాటు చేసిన గణేష్ మండపాలను నారాయణపేట సీఐ శివశంకర్, టౌన్ ఎస్ఐ వెంకటేశ్వర్లు సందర్శించి భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం మండపాల వద్ద నిర్వహిస్తున్న పాయింట్ బుక్స్‌ను తనిఖీ చేసి, నిర్వాహకులకు పలు సూచనలు చేశారు.ఈ సందర్భంగా సీఐ శివశంకర్, ఎస్ఐ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ గణేష్ మండపాల వద్ద 24 గంటలూ కనీసం ఇద్దరు నిర్వాహకులు తప్పనిసరిగా అందుబాటులో ఉండేలా చూసుకోవాలని సూచించారు. మండపాల వద్ద ఫైర్ సేఫ్టీకి సంబంధించిన అన్ని ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, విద్యుత్ వైర్లు, షార్ట్ సర్క్యూట్ తదితర ప్రమాదాలకు అవకాశం లేకుండా అప్రమత్తంగా ఉండాలని తెలిపారు.పోలీసులు మండపాల వద్ద పాయింట్ బుక్స్ తనిఖీకి వచ్చినప్పుడు నిర్వాహకులు పూర్తి సహకారం అందించాలని, విగ్రహాలు, మండపాల వద్ద చోరీలు జరగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. సాయంత్రం వేళ గణేష్ విగ్రహాలను దర్శించుకునేందుకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా క్రమశిక్షణతో ఏర్పాట్లు చేసుకోవాలని తెలిపారు.మండపాల వద్ద నిర్వహించే కార్యక్రమాల్లో మహిళల పట్ల గౌరవంగా వ్యవహరించాలని, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా నిర్వాహకులు బాధ్యతగా వ్యవహరించాలని ఎస్ఐ వెంకటేశ్వర్లు సూచించారు.గణేష్ విగ్రహాల శోభాయాత్రలు, ఉత్సవాల సందర్భంగా డీజేలకు అనుమతి లేదని, ఎవరూ డీజేలు ఏర్పాటు చేయరాదని స్పష్టం చేశారు. అలాగే రాత్రి 10 గంటల తర్వాత సౌండ్ బాక్సులను తప్పనిసరిగా నిలిపివేయాలని, పరిసర కాలనీల ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా శబ్ద నియంత్రణ నిబంధనలు పాటించాలని సూచించారు.గణేష్ ఉత్సవాలను ప్రజలందరూ సంతోషంగా, భక్తిశ్రద్ధలతో, శాంతియుత వాతావరణంలో నిర్వహించుకోవాలని సీఐ కోరారు.ఈ తనిఖీల్లో గణేష్ మండపాల నిర్వాహకులు, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



ఇరాన్‌తో యుద్ధం.. అమెరికాకు ఇప్పటి వరకు ఎంత ఖర్చయిందో తెలుసా?

ఇరాన్‌తో అమెరికా చేపట్టిన సైనిక చర్యకు ఇప్పటికే భారీగా ఖర్చయింది. ఈ ఏడాది జులై వరకు పెంటగాన్ దాదాపు 38 బిలియన్ డాలర్లు (సుమారు రూ.3.65 లక్షల కోట్లు) ఖర్చు చేసినట్లు అమెరికా కాంగ్రెస్ బడ్జెట్ కార్యాలయం (సీబీఓ) తెలిపింది. యుద్ధం కొనసాగితే ప్రతి నెలా మరో 2 నుంచి 3 బిలియన్ డాలర్లు (సుమారు రూ.19,190 కోట్ల నుంచి రూ.28,785 కోట్లు) ఖర్చయ్యే అవకాశం ఉందని పేర్కొంది.ఫిబ్రవరి 28న ప్రారంభమైన 'ఆపరేషన్ ఎపిక్ ఫ్యూరీ'కి సంబంధించిన సైనిక, రవాణా, ఆర్థిక వ్యయాలను సీబీఓ పరిశీలించింది. మొత్తం 38 బిలియన్ డాలర్లలో 21.7 బిలియన్ డాలర్లు (సుమారు రూ.2.08 లక్షల కోట్లు) క్షిపణులు, ఇతర ఆయుధాలను సమకూర్చేందుకే ఖర్చయ్యాయి.అందులో క్షిపణి రక్షణ ఇంటర్‌సెప్టర్లకు 13.1 బిలియన్ డాలర్లు (సుమారు రూ.1.26 లక్షల కోట్లు), భూతల దాడి క్రూయిజ్ క్షిపణులకు 7.3 బిలియన్ డాలర్లు (సుమారు రూ.70,044 కోట్లు) వెచ్చించారు. అదనపు విమాన ప్రయాణాలకు 10.4 బిలియన్ డాలర్లు (సుమారు రూ.99,788 కోట్లు), సైనిక ఇంధన ఖర్చులకు 2.7 బిలియన్ డాలర్లు (సుమారు రూ.25,907 కోట్లు) ఖర్చయ్యాయి.యుద్ధంలో ధ్వంసమైన పరికరాలకు 1.9 బిలియన్ డాలర్లు (సుమారు రూ.18,231 కోట్లు), ఇతర కార్యకలాపాలకు 1.5 బిలియన్ డాలర్లు (సుమారు రూ.14,393 కోట్లు) ఖర్చైనట్లు సీబీఓ తెలిపింది.అమెరికా క్షిపణి రక్షణ నిల్వలు గణనీయంగా తగ్గిపోయాయని సీబీఓ హెచ్చరించింది. 2025 జూన్ నుంచి ఇప్పటివరకు అందుబాటులో ఉన్న ఇంటర్‌సెప్టర్లలో సగం నుంచి మూడింట రెండొంతుల వరకు వినియోగించి ఉండొచ్చని పేర్కొంది. వాటిని తిరిగి సమకూర్చేందుకు కనీసం ఐదేళ్లు పట్టొచ్చని అంచనా వేసింది.యుద్ధ ప్రభావం అమెరికా ఆర్థిక వ్యవస్థను గణనీయంగా దెబ్బతీస్తోంది. హర్మూజ్ జలసంధి, ఎర్ర సముద్రం మీదుగా చమురు, సహజ వాయువు రవాణాకు అంతరాయం ఏర్పడటంతో ఇంధన ధరలు పెరిగాయి. దీంతో 2026 రెండో త్రైమాసికంలో వార్షిక ద్రవ్యోల్బణ రేటుపై 2.3 శాతం పాయింట్ల ప్రభావం పడిందని సీబీఓ తెలిపింది. 2027 తొలి త్రైమాసికంలో ద్రవ్యోల్బణం గత అంచనా కంటే 0.5 శాతం పాయింట్లు ఎక్కువగా ఉండొచ్చని పేర్కొంది.వైట్‌హౌస్ మొత్తం 87.6 బిలియన్ డాలర్ల (సుమారు రూ.8.41 లక్షల కోట్లు) అదనపు నిధులు కోరింది. ఇందులో పెంటగాన్ కోసం 67.1 బిలియన్ డాలర్లు (సుమారు రూ.6.44 లక్షల కోట్లు) ఉన్నాయి. అందులో 42.3 బిలియన్ డాలర్లు (సుమారు రూ.4.06 లక్షల కోట్లు) నేరుగా ఇరాన్ యుద్ధానికి సంబంధించినవిగా కనిపిస్తున్నాయని సీబీఓ తెలిపింది.అయితే ఈ అంచనాల్లో అమెరికా సైనిక స్థావరాల మరమ్మతుల ఖర్చు లేదు. దౌత్య కార్యకలాపాలు, విదేశీ సాయం, గాయపడిన సైనికుల భవిష్యత్ వైద్యం, పరిహారం ఖర్చులనూ సీబీఓ లెక్కలోకి తీసుకోలేదు. పెంటగాన్ కోరిన సమాచారం పూర్తిగా అందకపోవడంతో నివేదికలోని అంచనాల్లో గణనీయమైన అనిశ్చితి ఉందని సీబీఓ స్పష్టం చేసింది.



నెయ్యిని కొనుగోలు చేస్తున్నారా.. అయితే నాణ్యమైన నెయ్యిని ఎలా గుర్తించాలో తెలుసుకోండి..

భారతీయ వంటకాల్లో నెయ్యికి ప్రత్యేక స్థానం ఉంది. బంగారు రంగులో కనిపించే నెయ్యి రుచిని పెంచడమే కాకుండా శరీరానికి అవసరమైన కొన్ని కొవ్వు పదార్థాలు, కొవ్వులో కరిగే విటమిన్లను అందిస్తుంది. నెయ్యిలో విటమిన్ ఎ, డి, ఇ, కెతో పాటు ఒమెగా-3, ఒమెగా-6 కొవ్వు ఆమ్లాలు ఉంటాయి. ఇందులో ఉండే బ్యూటిరేట్ అనే పదార్థం పేగుల ఆరోగ్యానికి తోడ్పడటంతోపాటు శరీరంలో వాపును తగ్గించే లక్షణాలను కూడా కలిగి ఉంటుంది. అయితే నెయ్యిలో కేలరీలు అధికంగా ఉంటాయి కాబట్టి పరిమితంగా తీసుకోవడం అవసరం. మార్కెట్‌లో ప్రస్తుతం వివిధ రకాల నెయ్యిలు అందుబాటులో ఉన్నాయి. అయితే పోషక విలువ, స్వచ్ఛత విషయంలో అన్ని రకాల నెయ్యిలు ఒకేలా ఉండవు. నెయ్యికి పెరుగుతున్న డిమాండ్‌తో కల్తీ జరిగే ప్రమాదం కూడా ఉంది. ముఖ్యంగా దుకాణాల్లో లభించే ప్యాక్ చేసిన నెయ్యిని కొనుగోలు చేసేటప్పుడు కేవలం ప్యాక్‌పై ఉన్న పేరు లేదా లేబుల్‌ను చూసి నిర్ణయం తీసుకోకూడదని నిపుణులు సూచిస్తున్నారు.



లేబుల్ మాత్రమే చూసి చెప్పలేం..

సూపర్‌మార్కెట్‌లలో కొనుగోలు చేసే సాధారణ నెయ్యి అయినా, ఎ2 నెయ్యి అయినా.. లేబుల్ మాత్రమే చూసి అది సరైన నెయ్యి అని నిర్ధారించలేమని నిపుణులు చెబుతున్నారు. నెయ్యి నాణ్యతను అంచనా వేయడానికి అది ఏ పాల నుంచి తయారైంది, ఏ పద్ధతిలో తయారు చేశారు అనే రెండు అంశాలను పరిశీలించాలి. అత్యుత్తమమైన నెయ్యి ఏదని అడిగితే ఇంట్లో తయారు చేసుకునే నెయ్యికే ప్రాధాన్యత ఇవ్వాలని నిపుణులు చెబుతున్నారు. సంప్రదాయ పద్ధతిలో ముందుగా పాలను పెరుగుగా మార్చి, ఆ పెరుగును చేతితో చిలికి తెల్ల వెన్నను తీస్తారు. ఆ వెన్నను తక్కువ మంటపై నెమ్మదిగా వేడి చేస్తే నెయ్యి తయారవుతుంది. ఈ విధానాన్ని నెయ్యి తయారీలో అత్యుత్తమ ప్రమాణంగా పరిగణించవచ్చని చెబుతున్నారు. అయితే ప్రస్తుత జీవనశైలిలో చాలామందికి ఇంట్లో నెయ్యి తయారు చేసుకునేంత సమయం లేకపోవడం కూడా వాస్తవమే. అందువల్ల ప్యాక్ చేసిన నెయ్యిని కొనుగోలు చేసేవారు ముందుగా అది ఎ2 ఆవు నెయ్యి కాదా అనేది పరిశీలించాలి. ఎ2 అనేది పాలలో ఉండే బీటా-కేసిన్ అనే ప్రోటీన్‌కు సంబంధించిన ఒక ప్రత్యేక రకం. సాధారణ పాలలో ఎ1, ఎ2 అనే రెండు రకాల బీటా-కేసిన్ ప్రోటీన్లు ఉంటాయి. ఎ2 నెయ్యి మాత్రం ఎ2 ప్రోటీన్ మాత్రమే ఉత్పత్తి చేసే ఆవుల పాల నుంచి తయారవుతుంది. పాల ఉత్పత్తులను తీసుకున్నప్పుడు స్వల్పంగా ఇబ్బంది పడేవారికి ఎ2 నెయ్యి జీర్ణశయంపై తేలికగా ఉంటుంది.

తయారీ విధానం కూడా ముఖ్యమే..

నెయ్యి కొనేటప్పుడు చూడాల్సిన మరో ముఖ్యమైన అంశం దాని తయారీ విధానం. ప్యాక్‌పై బిలోనా లేదా కల్చర్డ్ నెయ్యి అని ఉందా, పెరుగుతో తయారు చేశారా, సంప్రదాయ పద్ధతిలో చేతితో చిలికినట్లు తయారీ సంస్థ పేర్కొందా అనే విషయాలను పరిశీలించాలి. బిలోనా పద్ధతి నెయ్యి తయారీలో ఉపయోగించే పురాతన సంప్రదాయ విధానం. అసలైన బిలోనా పద్ధతిలో ఐదు దశలు ఉంటాయి. మొదటి దశలో తాజా ఎ2 పాలను మట్టి లేదా ఇత్తడి పాత్రల్లో నెమ్మదిగా మరిగిస్తారు. పాలను శుద్ధి చేయడంతోపాటు అందులోని పోషకాలను కేంద్రీకరించేందుకు ఈ ప్రక్రియ ఉపయోగపడుతుంది. రెండో దశలో పాలను చల్లార్చి, సహజమైన పులిసే పదార్థాన్ని కలుపుతారు. ఆ తర్వాత రాత్రంతా ఉంచితే మొత్తం పాలు పెరుగుగా మారతాయి. మూడో దశలో ఆ పెరుగును బిలోనా అనే చెక్క కవ్వంతో చేతితో చిలుకుతారు. కవ్వాన్ని ముందుకు, వెనుకకు కదుపుతూ చిలకడం ద్వారా పెరుగు మజ్జిగ, వెన్నగా విడిపోతుంది. నాలుగో దశలో చేతితో చిలికిన వెన్నను పైకి తీసి మజ్జిగ నుంచి వేరు చేస్తారు. వెన్నను కడిగి శుభ్రం చేసి, మిగిలిన మజ్జిగ నుంచి పూర్తిగా వేరు చేస్తారు. ఐదో దశలో ఈ వెన్నను తక్కువ మంటపై నెమ్మదిగా వేడి చేస్తారు. వేడి కారణంగా వెన్నలోని నీరు ఆవిరైపోతుంది. పాలలోని ఘన పదార్థాలు కిందకు చేరతాయి. చివరికి బంగారు రంగులో, మంచి సువాసనతో కూడిన నెయ్యి మిగులుతుంది.

మార్కెట్‌లో ఉన్న నెయ్యి ఎలాంటిది అంటే..

అయితే మార్కెట్‌లో లభించే చాలా నెయ్యిలు, ఖరీదైన ఎ2 నెయ్యిలు కూడా, సంప్రదాయ బిలోనా పద్ధతిలో కాకుండా నేరుగా పాల మీగడ నుంచి తయారు చేస్తారని నిపుణులు చెబుతున్నారు. ఈ విధానం వేగంగా, తక్కువ ఖర్చుతో పూర్తవుతుంది. అయితే మీగడ నుంచి తయారు చేసిన నెయ్యి తప్పనిసరిగా బాగుండదని దీని అర్థం కాదని, కానీ అది సంప్రదాయ బిలోనా పద్ధతిలో తయారైన నెయ్యితో ఒకేలా ఉండదని వివరిస్తున్నారు. కాబట్టి నెయ్యి కొనుగోలు చేసేటప్పుడు గుర్తుంచుకోవాల్సిన సులభమైన నియమం ఏమిటంటే.. ఎ2 అనేది నెయ్యి తయారైన పాల గురించి చెబుతుంది. బిలోనా అనేది నెయ్యి తయారైన విధానం గురించి చెబుతుంది. మంచి నెయ్యిని ఎంచుకునేటప్పుడు ఈ రెండు అంశాలకూ ప్రాధాన్యత ఇవ్వడం ముఖ్యం.



పనస గింజల్లో ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలున్నాయి.. మరి షుగర్ పేషెంట్‌లు తినొచ్చా..?

పనసపండు అంటే చాలామందికి ఇష్టమే ఉంటుంది. దాని తియ్యటి రుచి, ప్రత్యేకమైన వాసన ఎంతో ఆకట్టుకుంటాయి. అయితే పనసపండు తిన్న తర్వాత కొంతమంది గింజలను పడేస్తుంటారు. కానీ పనస గింజల్లో కూడా ఎన్నో పోషకాలు ఉంటాయి. వీటిలో ప్రోటీన్, ఫైబర్, ఒమేగా-3, ఒమేగా-6 వంటి ఆరోగ్యకరమైన కొవ్వులు, విటమిన్ ఏ, సీ, ఈ, బీ విటమిన్‌లు, ఐరన్, మెగ్నీషియం, పొటాషియం, జింక్ వంటి పోషకాలు ఉంటాయి. ఆరోగ్య నిపుణుల ప్రకారం.. పనస గింజల్లో ఉండే ఫైబర్ జీర్ణక్రియకు సహాయపడుతుంది. దాంతో మలబద్ధకం సమస్య తొలగిపోతుంది.పనస గింజల్లో ఫైబర్ ఎక్కువగా ఉండటంవల్ల కడుపు ఎక్కువసేపు నిండుగా ఉన్న భావన కలుగుతుంది. దాంతో తరచుగా తినాలనే కోరిక తగ్గి, బరువు నియంత్రణకు కొంత సహాయపడుతుంది. పనస గింజల్లో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు శరీరంలోని ఫ్రీ రాడికల్స్ వల్ల కలిగే నష్టాన్ని తగ్గించడంలో సహాయపడతాయి. ఇందులోని మెగ్నీషియం, పొటాషియం వంటి ఖనిజాలు గుండె ఆరోగ్యానికి అవసరమైన పోషకాలు. అలాగే పనస గింజల్లో ఐరన్ కూడా ఉంటుంది. ఇది శరీరంలో ఎర్ర రక్త కణాల తయారీకి అవసరం. విటమిన్ సీ, యాంటీ ఆక్సిడెంట్లు చర్మం, జుట్టు ఆరోగ్యానికి కూడా ఉపయోగపడవచ్చు.మధుమేహం ఉన్నవారు పనస గింజలను ఉడికించి లేదా తక్కువ నూనెతో వండుకుని పరిమితంగా తీసుకోవచ్చు. వీటిలో ఉండే ఫైబర్ ఆహారం జీర్ణమయ్యే వేగాన్ని నెమ్మదించడంలో సహాయపడుతుంది. దాంతో భోజనం తర్వాత రక్తంలో చక్కెర స్థాయి ఒక్కసారిగా పెరగకుండా ఉండేందుకు కొంత ఉపయోగపడవచ్చు. అయితే పనస గింజలు మధుమేహాన్ని నయం చేస్తాయని లేదా రక్తంలో చక్కెర స్థాయిని కచ్చితంగా నియంత్రిస్తాయని చెప్పలేం. మధుమేహం ఉన్నవారు తమ ఆహారంలో వీటిని చేర్చుకునే ముందు, ముఖ్యంగా మందులు వాడుతున్నట్లయితే, వైద్యుల లేదా డైటీషియన్ సలహా తీసుకోవడం మంచిది.



షుగర్ స్థాయిలు అమాంతం పెరగకుండా ఉండాలంటే భోజనాన్ని ఈ క్రమంలో తీసుకోవాలి..

భోజనం చేసిన తర్వాత రక్తంలో చక్కెర స్థాయిలు ఒక్కసారిగా పెరగడం కొందరిలో ఆకలి, అలసట, నిద్రమత్తు వంటి సమస్యలకు కారణం అవుతుంది. మధుమేహం ఉన్నవారికే కాకుండా, సాధారణంగా ఆరోగ్యంగా ఉన్నవారిలోనూ భోజనం తర్వాత రక్తంలో చక్కెరలో వచ్చే మార్పులు రోజువారీ శక్తి స్థాయిలు, ఆకలిపై ప్రభావం చూపుతాయి. అయితే మనం ఏ ఆహారం తీసుకుంటున్నామనే దానితో పాటు, దాన్ని ఏ క్రమంలో తీసుకుంటున్నామన్నది కూడా రక్తంలో చక్కెర పెరుగుదలపై ప్రభావం చూపే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు. కార్బోహైడ్రేట్లు ఎక్కువగా ఉండే లేదా త్వరగా జీర్ణమయ్యే ఆహారాన్ని తీసుకున్నప్పుడు రక్తంలో చక్కెర స్థాయిలు వేగంగా పెరుగుతాయి. దీనికి ప్రతిస్పందనగా శరీరం ఇన్సులిన్‌ను విడుదల చేస్తుంది. రక్తంలో ఉన్న చక్కెరను కణాల్లోకి చేరేలా చేయడంలో ఇన్సులిన్ సహాయపడుతుంది. అయితే భోజనం తర్వాత రక్తంలో చక్కెర ఎంత మేరకు, ఎంత వేగంగా పెరుగుతుందనేది వ్యక్తిని బట్టి మారుతుంది. ఒకే రకమైన కార్బోహైడ్రేట్‌లను తీసుకున్నా, దానితో పాటు తీసుకునే ఇతర ఆహార పదార్థాలు కూడా ఈ మార్పులపై ప్రభావం చూపుతాయి.

గ్లైసెమిక్ సూచిక ఎక్కువగా ఉంటే..

గ్లైసెమిక్ సూచిక ఎక్కువగా ఉన్న ఆహారాలను తరచూ తీసుకోవడం వల్ల రక్తంలో చక్కెర వేగంగా పెరిగి, ఆ తర్వాత తగ్గే పరిస్థితి ఏర్పడుతుంది. దీంతో భోజనం చేసిన కొద్దిసేపటికే మళ్లీ ఆకలి వేయడం, తీపి లేదా ఇతర ఆహారాలపై కోరిక కలగడం, అలసట లేదా నిద్రమత్తు వంటి అనుభూతులు కొందరిలో కనిపించే వీలు ఉంటుంది. శరీరం తరచూ పెద్ద మొత్తంలో ఇన్సులిన్‌ను విడుదల చేయాల్సిన పరిస్థితి కొనసాగితే కాలక్రమేణా ఇన్సులిన్ నిరోధకత అభివృద్ధి చెందే అవకాశం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. అయితే మధుమేహం అంటే సంక్లిష్టమైన ఆరోగ్య సమస్య అని, దానికి కేవలం భోజనం తర్వాత రక్తంలో చక్కెర ఒక్కసారిగా పెరగడమే కారణం కాదని గుర్తుంచుకోవాలి. భోజనం చేసే క్రమంలో కొన్ని మార్పులు చేయడం ద్వారా రక్తంలో చక్కెర పెరుగుదలను కొంతవరకు నియంత్రించవచ్చని సూచిస్తున్నారు. ముందుగా పీచు పదార్థాలు అధికంగా ఉండే ఆహారాన్ని తీసుకోవడం ఇందులో మొదటి దశ. ముఖ్యంగా ఆకుకూరలు, ఇతర పీచు అధికంగా ఉండే కూరగాయలను భోజనం ప్రారంభంలో తీసుకోవడం మంచిదని సూచిస్తున్నారు.

ప్రోటీన్లు, కొవ్వులను ఎప్పుడు తినాలి..

ఆ తర్వాత ప్రోటీన్, ఆరోగ్యకరమైన కొవ్వులు ఉండే ఆహారాన్ని తీసుకోవాలి. ప్రోటీన్, ఆరోగ్యకరమైన కొవ్వులను భోజనంలో భాగంగా చేర్చడం వల్ల కార్బోహైడ్రేట్లు శరీరంలోకి చేరే విధానంపై ప్రభావం చూపుతాయి. చివరిగా బియ్యం, చపాతీ వంటి పిండి పదార్థాలు లేదా చక్కెరలు అధికంగా ఉండే ఆహారాన్ని తీసుకోవాలని సూచిస్తున్నారు. అంటే ముందుగా పీచు పదార్థాలు, ఆ తర్వాత ప్రోటీన్, ఆరోగ్యకరమైన కొవ్వులు, చివరగా పిండి పదార్థాలు, చక్కెరలు తీసుకోవడం ఈ భోజన క్రమంలోని ప్రధాన ఉద్దేశం. అలాగే సాధ్యమైనంత వరకు పీచు అధికంగా ఉండే, తక్కువగా ప్రాసెస్ చేసిన ఆహారాలను ఎంచుకోవడం మంచిది. కార్బోహైడ్రేట్లను ప్రోటీన్, ఆరోగ్యకరమైన కొవ్వులతో కలిపి తీసుకోవడం, శుద్ధి చేసిన చక్కెరలు, అధికంగా ప్రాసెస్ చేసిన కార్బోహైడ్రేట్లను తగ్గించడం కూడా రక్తంలో చక్కెర నియంత్రణకు తోడ్పడుతాయి. అయితే కేవలం ఆహారాన్ని తీసుకునే క్రమాన్ని మార్చడం ద్వారా మధుమేహాన్ని నియంత్రించవచ్చని భావించకూడదు. మధుమేహం లేదా మధుమేహానికి ముందు దశలో ఉన్నవారికి మొత్తం ఆహారపు అలవాట్లు, శారీరక చురుకుదనం, మందులు, ఇతర ఆరోగ్య పరిస్థితులు కూడా ముఖ్యమే. అందువల్ల భోజనం చేసే క్రమాన్ని ఒక ఆరోగ్యకరమైన అలవాటుగా పాటించవచ్చు కానీ వైద్యులు సూచించిన చికిత్సకు ఇది ప్రత్యామ్నాయం కాదని నిపుణులు సూచిస్తున్నారు.

కండరాలను పెంచుకోవాలనుకునే వారు

వ్యాయామాలను ఇలా చేయాలి..

కండరాలను పెంచుకోవాలనుకునేవారు వ్యాయామశాలలో ఎక్కువ సమయం గడపకుండానే తమ శిక్షణను మరింత ప్రభావవంతంగా మార్చుకోవడానికి కొన్ని ప్రత్యేక పద్ధతులను ఉపయోగిస్తుంటారు. వాటిలో డ్రాప్ సెట్స్, సూపర్ సెట్స్ ప్రముఖమైనవి. రెండూ శక్తి పెంపు వ్యాయామాల్లో విస్తృతంగా ఉపయోగించే పద్ధతులే అయినప్పటికీ, వాటి విధానం మాత్రం భిన్నంగా ఉంటుంది. డ్రాప్ సెట్‌లో బరువును తగ్గిస్తూ అదే వ్యాయామాన్ని కొనసాగిస్తారు. సూపర్ సెట్‌లో మాత్రం తక్కువ విరామంతో వరుసగా రెండు వ్యాయామాలు చేస్తారు. అయితే కండరాల పెరుగుదల ప్రధాన లక్ష్యంగా ఉన్నప్పుడు ఈ రెండింటిలో ఏది ఎంచుకోవాలి అనే సందేహం చాలామందికి ఉంటుంది. డ్రాప్ సెట్‌లో ఒక వ్యాయామాన్ని కండరాలు పూర్తిగా అలసిపోయే స్థాయికి లేదా ఆ స్థాయికి దగ్గరగా చేసే వరకు కొనసాగిస్తారు. ఆ తర్వాత వెంటనే బరువును తగ్గించి మరికొన్ని పునరావృతాలు చేస్తారు. ఉదాహరణకు, ఎక్కువ బరువుతో 10 సార్లు చేతి కండరాల వ్యాయామం చేసిన తర్వాత సరైన భంగిమను కొనసాగించడం కష్టంగా మారితే బరువును తగ్గించి మరికొన్ని సార్లు చేస్తారు. కొందరు బరువును మరోసారి తగ్గించి మళ్లీ పునరావృతాలు చేస్తారు. దీనిని డబుల్ లేదా ట్రిపుల్ డ్రాప్ సెట్ అంటారు. సాధారణంగా వ్యాయామాన్ని ఆపే స్థాయిని దాటి కండరాలకు మరింత పని కల్పించడమే డ్రాప్ సెట్ ప్రధాన ఉద్దేశం.



డ్రాప్ సెట్స్ ఉపయోగం..

తక్కువ సమయంలో కండరాలకు ఎక్కువ పని కల్పించడంలో డ్రాప్ సెట్స్ ఉపయోగపడతాయి. మొదట ఉపయోగించిన బరువుతో కొనసాగించడం కష్టంగా మారిన తర్వాత తక్కువ బరువుతో వ్యాయామం కొనసాగించడం ద్వారా కండరాలకు శిక్షణను కొనసాగించవచ్చు. దీనివల్ల వ్యాయామం సమయంలో కండరాల్లో తీవ్రమైన మంట లేదా మంటలాంటి అనుభూతి కలిగే అవకాశం ఉంటుంది. అయితే ఆ మంట ఎక్కువగా అనిపించడం మాత్రమే కండరాల పెరుగుదలకు నిదర్శనం అని భావించకూడదు. సూపర్ సెట్‌లో రెండు వ్యాయామాలను వరుసగా, మధ్యలో చాలా తక్కువ విరామంతో లేదా విరామం లేకుండా చేస్తారు. దీనిని వివిధ రకాలుగా చేయవచ్చు. ఉదాహరణకు ఒకే కండర భాగాన్ని లక్ష్యంగా చేసుకుని ముందుగా చేతి కండరాల వ్యాయామం, వెంటనే మరో చేతి కండరాల వ్యాయామం చేయవచ్చు. అలాగే ఒకదానికొకటి వ్యతిరేకంగా పనిచేసే కండర భాగాలను జత చేయవచ్చు. ఉదాహరణకు ముందుగా బైసెప్స్, వెంటనే ట్రైసెప్స్ వ్యాయామం చేయవచ్చు. శరీరంలోని వేర్వేరు భాగాలను లక్ష్యంగా చేసుకునే రెండు వ్యాయామాలను కూడా జత చేయవచ్చు.

సూపర్ సెట్స్ ఎందుకు..

సూపర్ సెట్స్ ప్రధాన ప్రయోజనం సమయాన్ని ఆదా చేయడం. సాధారణంగా ఒక వ్యాయామం చేసిన తర్వాత కొన్ని నిమిషాలు విశ్రాంతి తీసుకునే సమయంలో మరో వ్యాయామం చేయవచ్చు. ఇలా చేయడం వల్ల తక్కువ సమయంలోనే ఎక్కువ వ్యాయామ పరిమాణాన్ని పూర్తి చేయడానికి వీలవుతుంది. డ్రాప్ సెట్స్, సూపర్ సెట్స్ మధ్య ప్రధాన తేడా వ్యాయామ తీవ్రతను పెంచే విధానంలో ఉంటుంది. డ్రాప్ సెట్‌లో కండరాలు అలసిపోయే కొద్దీ బరువును తగ్గిస్తూ అదే వ్యాయామాన్ని కొనసాగిస్తారు. సూపర్ సెట్‌లో మాత్రం తక్కువ విరామంతో ఒక వ్యాయామం నుంచి మరో వ్యాయామానికి మారుతారు. సులభంగా చెప్పాలంటే, డ్రాప్ సెట్ అంటే అదే వ్యాయామాన్ని తక్కువ బరువుతో మరిన్ని సార్లు చేయడం. సూపర్ సెట్ అంటే రెండు వ్యాయామాలను తక్కువ లేదా ఎలాంటి విరామం లేకుండా వరుసగా చేయడం. రెండూ వ్యాయామాన్ని మరింత కఠినంగా మార్చగలిగినా వాటి ఉపయోగం కొంత భిన్నంగా ఉంటుంది. కండరాల పెరుగుదల కోసం ఈ రెండింటిలో ఏదో ఒకటి అందరికీ తప్పనిసరిగా మెరుగైనదని చెప్పలేం. కండరాల పెరుగుదల అనేది వ్యాయామ పరిమాణం, క్రమంగా బరువు లేదా పనితీరును పెంచడం, సరైన వ్యాయామాల ఎంపిక, తగినంత ప్రొటీన్ తీసుకోవడం, అవసరమైన కేలరీలు, నిద్ర, శరీరానికి సరైన విశ్రాంతి వంటి అనేక అంశాలపై ఆధారపడి ఉంటుంది. అందువల్ల డ్రాప్ సెట్స్, సూపర్ సెట్స్‌ను సరిగ్గా రూపొందించిన శక్తి వ్యాయామ కార్యక్రమంలో భాగంగా ఉపయోగించవచ్చు.

ఏం చేయాలి..

కండరాలను పూర్తిగా అలసటకు దగ్గరగా తీసుకెళ్లడంతో పాటు, ఎక్కువ బరువును పదేపదే ఉపయోగించకుండా ఒకే వ్యాయామాన్ని మరికొంతసేపు కొనసాగించాలనుకునే సమయంలో డ్రాప్ సెట్స్ ఉపయోగకరంగా ఉంటాయి. మరోవైపు తక్కువ సమయంలో ఎక్కువ వ్యాయామ పరిమాణాన్ని పూర్తి చేయాలనుకునేవారికి సూపర్ సెట్స్ అనుకూలంగా ఉంటాయి. ముఖ్యంగా సమయం తక్కువగా ఉన్నవారికి ఇవి ఉపయోగపడతాయి. సాధారణంగా వ్యాయామం చివరి భాగంలో లేదా వ్యాయామ కార్యక్రమం చివర్లో తీవ్రతను పెంచడానికి డ్రాప్ సెట్స్‌ను ఉపయోగించవచ్చు. బరువును త్వరగా తగ్గించడం సులభంగా ఉండే యంత్రాల ఆధారిత వ్యాయామాలు లేదా ఒకే కండర భాగాన్ని లక్ష్యంగా చేసుకునే వ్యాయామాల్లో వీటిని ఉపయోగించడం సౌకర్యంగా ఉంటుంది. ఉదాహరణకు తొడ కండరాల వ్యాయామంలో బరువును తగ్గించి మరికొన్ని పునరావృతాలు చేయడం, భుజాల పక్క భాగాల వ్యాయామంలో బరువును తగ్గించి కొనసాగించడం, చేతి కండరాల వ్యాయామంలో బరువు తగ్గించి మరిన్ని పునరావృతాలు చేయడం వంటివి చేయవచ్చు. అయితే సాంకేతికంగా కష్టమైన, అనేక కండర భాగాలు కలిసి పనిచేసే వ్యాయామాల్లో అలసట కారణంగా వ్యాయామ భంగిమ దెబ్బతినే అవకాశం ఉండటంతో డ్రాప్ సెట్స్‌ను జాగ్రత్తగా ఉపయోగించాలి. సమయం తక్కువగా ఉందనుకుంటే.. వ్యాయామానికి తక్కువ సమయం కేటాయించగలిగే వారికి సూపర్ సెట్స్ ప్రత్యేకంగా ఉపయోగపడతాయి. ఉదాహరణకు ముందుగా బైసెప్స్ వ్యాయామాలన్నీ చేసి తర్వాత ట్రైసెప్స్ వ్యాయామాలు చేయడం బదులుగా, ఒకసారి బైసెప్స్ వ్యాయామం చేసి వెంటనే ట్రైసెప్స్ వ్యాయామం చేసి, ఆ తర్వాత విశ్రాంతి తీసుకుని మళ్లీ అదే క్రమాన్ని కొనసాగించవచ్చు. రెండు వేర్వేరు కండర భాగాలను జత చేస్తే ఒక కండర భాగం పనిచేస్తున్న సమయంలో మరో కండర భాగానికి కొంత విశ్రాంతి లభిస్తుంది. అయితే ఒకే కండర భాగాన్ని ఎక్కువగా ఉపయోగించే రెండు కఠినమైన వ్యాయామాలను జత చేస్తే అలసట వేగంగా పెరిగి పనితీరుపై ప్రభావం చూపిస్తుంది. వ్యాయామం చేసిన తర్వాత పూర్తిగా అలసిపోయినంత మాత్రాన అది మరింత మెరుగైన వ్యాయామం అని భావించడం సాధారణంగా జరిగే పొరపాటు. వ్యాయామ తీవ్రత ఎక్కువగా ఉండడం ఎప్పుడూ మంచిదని కాదు. ప్రతి వ్యాయామంలోనూ డ్రాప్ సెట్స్, సూపర్ సెట్స్ జోడిస్తే శరీరానికి తగినంత విశ్రాంతి ఇవ్వడం కష్టమవుతుంది. అధిక అలసట కారణంగా తర్వాతి వ్యాయామాల్లో పనితీరు కూడా తగ్గుతుంది. అందువల్ల వ్యాయామ కార్యక్రమానికి ప్రధాన ఆధారం క్రమంగా ప్రతిఘటనతో చేసే శక్తి వ్యాయామాలే కావాలి. కాలక్రమేణా మరిన్ని పునరావృతాలు చేయడం, బరువును పెంచడం లేదా సరైన వ్యాయామ పద్ధతిని మెరుగుపరచడం ద్వారా పనితీరును క్రమంగా పెంచుకోవడంపై దృష్టి పెట్టాలి. డ్రాప్ సెట్స్, సూపర్ సెట్స్ వంటి అధునాతన పద్ధతులు ప్రాథమిక వ్యాయామాలను భర్తీ చేయకుండా వాటికి అదనంగా ఉపయోగపడాలి.

నిర్దిష్ట కండర భాగం అయితే..

వ్యాయామశాలలో సమయం తక్కువగా ఉన్నవారు తమ శిక్షణను సమర్థవంతంగా పూర్తి చేయాలనుకుంటే సూపర్ సెట్స్‌ను ఎంచుకోవచ్చు. ఒక నిర్దిష్ట కండర భాగానికి అదనపు పని కల్పించి, కఠినమైన వ్యాయామాన్ని మరికొంతసేపు కొనసాగించాలనుకుంటే డ్రాప్ సెట్స్ ఉపయోగపడతాయి. అయితే ఈ రెండింటిలో ఒకదానినే తప్పనిసరిగా ఎంచుకోవాల్సిన అవసరం లేదు. ప్రధానంగా అనేక కండర భాగాలు కలిసి పనిచేసే వ్యాయామాలను సాధారణ పద్ధతిలో చేసి, కండరాలను ప్రత్యేకంగా లక్ష్యంగా చేసుకునే వ్యాయామాల్లో అవసరమైనప్పుడు సూపర్ సెట్స్ లేదా అప్పుడప్పుడు డ్రాప్ సెట్స్‌ను చేర్చవచ్చు. డ్రాప్ సెట్స్, సూపర్ సెట్స్ శక్తి వ్యాయామాలను మరింత సవాలుగా మార్చడంతో పాటు తక్కువ సమయంలో ఎక్కువ పని పూర్తి చేయడానికి సహాయపడతాయి. అయితే ఇవి కండరాలను వేగంగా పెంచే ఏకైక మార్గం లేదా అద్భుతమైన పరిష్కారం కావు. కండరాల పెరుగుదల కోసం క్రమం తప్పకుండా శక్తి వ్యాయామాలు చేయడం, క్రమంగా వ్యాయామ భారాన్ని పెంచడం, తగినంత ప్రొటీన్, అవసరమైన కేలరీలను తీసుకోవడం, సరైన నిద్ర, శరీరానికి తగిన విశ్రాంతి ఇవ్వడం వంటి ప్రాథమిక అంశాలపై ముందుగా దృష్టి పెట్టాలి. ఆ పునాదులు సరిగ్గా ఉన్నప్పుడు డ్రాప్ సెట్స్, సూపర్ సెట్స్ వ్యాయామ కార్యక్రమంలో వైవిధ్యాన్ని, అదనపు శిక్షణ ప్రభావాన్ని తీసుకురావడానికి ఉపయోగకరమైన పద్ధతులుగా మారతాయి.



నన్ను చూసే కోణంలోనే లోపం.. నా దుస్తుల్లో కాదు


ఐశ్వర్య లక్ష్మి

ప్రముఖ నటి ఐశ్వర్య లక్ష్మి గత కొన్ని రోజులుగా సోషల్ మీడియాలో జరుగుతున్న విపరీతమైన ట్రోలింగ్‌పై తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. ఇటీవల తిరువనంతపురంలో జరిగిన ఒక జువెలరీ షాప్ ప్రారంభోత్సవానికి హాజరైన సమయంలో ఆమె ధరించిన దుస్తులపై కొందరు నెటిజన్లు అసభ్యకర రీతిలో కామెంట్లు చేశారు. ఈ వివాదంపై తాజాగా ఒక ఇంటర్వ్యూలో స్పందించిన ఐశ్వర్య లక్ష్మి, ఆ రోజు ఈవెంట్‌లో జరిగిన అసలు నిజాలను వెల్లడించి ట్రోలర్లకు గట్టి కౌంటర్ ఇచ్చారు.ఆ ఈవెంట్‌లో కొందరు ఫొటోగ్రాఫర్లు తన ముఖాన్ని సరిగా కవర్ చేయకుండా, కావాలనే అనుచిత కోణాల్లో ఫొటోలు తీసేందుకు ప్రయత్నించారని ఆమె బహిరంగంగా ఆరోపించారు. ఆ అసౌకర్య వాతావరణం వల్ల తన బాడీ లాంగ్వేజ్ మారిందని, అంతేకానీ తన దుస్తుల్లో ఎలాంటి లోపం లేదని స్పష్టం చేశారు. ఇబ్బందికరంగా ఉంటే అలాంటి బట్టలు ఎందుకు వేసుకోవడం? అని ప్రశ్నించే వారి మానసికత్వాన్ని ఆమె తీవ్రంగా తప్పుబట్టారు.సంస్కృతి అనేది కేవలం మహిళలు వేసుకునే దుస్తుల్లోనే ఉందా, ప్రవర్తనలో ఉండదా..? అని ప్రశ్నించారు. దేశ ఆర్థిక వృద్ధి, వృద్ధుల సంక్షేమం లాంటి సామాజికాంశాలపై చర్చించని సమాజం, మహిళల దుస్తుల గురించి మాట్లాడేందుకు మాత్రం సిద్ధంగా ఉంటుందని ధ్వజమెత్తారు. ఇకనైనా ప్రతీ ఒక్కరూ మహిళల వ్యక్తిగత స్వేచ్ఛను గౌరవించడం నేర్చుకోవాలని ఐశ్వర్య హితవు పలికారు.

అది సర్వసాధారణం..

నఖ్వీతో ఫ్రెండ్లీ చాట్‌పై సైకియా రియాక్షన్

ఇంటర్నెట్ డెస్క్: మహిళల ఆసియా కప్ 2026 ఫైనల్‌లో జరిగిన ఓ ఘటన ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఏసీసీ ఛైర్మన్ మోసిన్ నఖ్వీతో బీసీసీఐ కార్యదర్శి దేవజిత్ సైకియా స్నేహపూర్వకంగా మాట్లాడుతున్న దృశ్యాలు వెలుగులోకి వచ్చాయి. దీనిపై విమర్శలు వ్యక్తమవుతోన్న వేళ.. సైకియా స్పందించారు. ఇతర క్రికెట్ బోర్డు ప్రతినిధులను కలవడం, వారితో మాట్లాడటం అత్యంత సర్వసాధారణమని పేర్కొన్నారు. దీనికి ప్రత్యేక అర్థాలు ఆపాంచికోవాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు.'మేము ఎవరినీ కలవకుండా ఉండలేం కదా. టాస్ నుంచి మ్యాచ్ పూర్తయ్యే వరకు నేను రాయల్ బాక్స్‌లోనే కూర్చున్నా. మ్యాచ్ సమయంలో అక్కడికి వచ్చిన ప్రతి ఒక్కరూ నన్ను కలిశారు. కొందరు నా పక్కన కూర్చున్నారు. శుక్లా వచ్చి నాతో కూర్చున్నారు. మీరు ప్రస్తావించిన వ్యక్తి (నఖ్వీ) కూడా డిప్యూటీ ఛైర్మన్ ఖాలిద్ అల్ జరోనీ సాహెబ్‌తో కలిసి నా పక్కన వచ్చి కూర్చున్నారు. నఖ్వీతో మాట్లాడిన దానికి ప్రత్యేక అర్థాలు ఆపాదించాల్సిన అవసరం లేదు. ఇతర క్రికెట్ బోర్డుల అధికారులను కలవడం సాధారణ ప్రక్రియే' అని సైకియా పేర్కొన్నారు.



మా ప్రయత్నాలు ఫలించలేదు..

మహిళల ఆసియా కప్ ఫైనల్ ముగిసిన తర్వాత తలెత్తిన ట్రోఫీ వివాదాన్ని పరిష్కరించేందుకు బీసీసీఐ ప్రయత్నించిందని కూడా సైకియా వెల్లడించారు. ట్రోఫీ విషయంలో ఏర్పడిన గందరగోళంపై బీసీసీఐ తరఫున ఏసీసీకి ఒక పరిష్కార మార్గాన్ని సూచించామని.. అయితే దానికి అంగీకారం లభించలేదని చెప్పారు. 'ట్రోఫీ విషయంలో ఏసీసీతో చర్చలు జరిపాం. మా ప్రయత్నాలు సఫలం అవ్వలేదు. అందుకు మాకు ఎలాంటి బాధ కూడా లేదు. ట్రోఫీ ఎవరు అందజేస్తారనే దానిపై దృష్టి పెట్టడం మా అంతిమ లక్ష్యం కాదు. భారత జట్టు విజయం సాధించాలన్నదే మా ప్రధాన ఆశయం. అది సాధించాం' అని సైకియా వివరించారు.

SPORTS

ఇమ్రాన్ ఖాన్ విషయంలో జోక్యం చేసుకోండి.. తమ ప్రభుత్వానికి ఆసీస్ మాజీ కెప్టెన్ల లేఖ

ఇంటర్నెట్ డెస్క్:
పాకిస్థాన్ క్రికెట్ మాజీ కెప్టెన్, ఆ దేశ మాజీ ప్రధాని ఇమ్రాన్ ఖాన్ ఆరోగ్యం, జైలు పరిస్థితులపై కొంతకాలంగా ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ప్రస్తుతం ఆయన రావల్పిండిలోని అదియాలా జైలులో ఉన్నారు. ఆయన ఆరోగ్య పరిస్థితిపై వస్తోన్న వార్తలపై ఆస్ట్రేలియా మాజీ కెప్టెన్లు స్పందించారు. ఇమ్రాన్ ఖాన్ విషయంలో జోక్యం చేసుకోవాలని తమ ప్రభుత్వానికి లేఖ రాశారు. ఇమ్రాన్‌కు మెరుగైన వైద్యం, న్యాయపరంగా సహాయం అందేలా పాకిస్థాన్ ప్రభుత్వంపై దౌత్యపరంగా ఒత్తిడి తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు. ఆసీస్ విదేశాంగ మంత్రి పెన్నీ వాంగ్‌కు రాసిన ఈ లేఖపై అలెన్ బోర్డర్, గ్రెగ్ చాపెల్, ఇయాన్ చాపెల్, బెలిండా క్లార్క్, కిమ్ హ్యూస్, మార్క్ టేలర్, స్టీవ్ వా సంతకాలు చేశారు.'ఇమ్రాన్‌పై ఉన్న కేసులు, ఆయనకు విధించిన శిక్ష లేదా పాకిస్థాన్ రాజకీయ వ్యవహారాలపై గురించి మాకు సంబంధం లేదు. అవన్నీ పాకిస్థాన్ అంతర్గత వ్యవహారాలు. కానీ జైలులో ఒక ఖైదీకి అందాల్సిన కనీస మానవతా ప్రమాణాలు మాత్రం తప్పనిసరిగా పాటించాలి. ఇమ్రాన్ ఖాన్ జైలు పరిస్థితులపై వస్తున్న వార్తలు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయి. ఆయన విషయంలో ఆస్ట్రేలియా ప్రభుత్వం జోక్యం చేసుకోవాలి. పాకిస్థాన్‌కు ఉన్న ఏకైక వన్డే ప్రపంచకప్‌ను ఇమ్రాన్ ఖాన్ నాయకత్వంలోనే ఆ దేశం గెలుచుకుంది. అనంతరం పాకిస్థాన్ ప్రధానమంత్రిగా కూడా ఆయన పనిచేశారు. క్రికెటర్‌గా, నాయకుడిగా ఇమ్రాన్ ఖాన్‌కు ఆస్ట్రేలియాలో ఎంతో గౌరవం ఉంది' అని ఏడుగురు ఆసీస్ మాజీ కెప్టెన్లు ఆ లేఖలో పేర్కొన్నారు.



అప్పుడు ఆరోగ్యంగా ఉన్నాడు: గ్రెగ్ చాపెల్

గ్రెగ్ చాపెల్ 2022లో ఇస్లామాబాద్‌లో ఇమ్రాన్ ఖాన్‌ను చివరిసారిగా కలిశారు. అప్పట్లో ఇమ్రాన్ పూర్తిగా ఆరోగ్యంగా, దృఢంగా ఉన్నారని చాపెల్ గుర్తుచేశారు. ఇప్పుడు ఆయన ఆరోగ్యం, జైలు పరిస్థితులకు సంబంధించిన వార్తలు అందుకు భిన్నంగా ఉండటం తమను కలవరపెడుతోందని లేఖలో పేర్కొన్నారు. ఇమ్రాన్ ఖాన్ విషయంలో ఆస్ట్రేలియా ప్రభుత్వం జోక్యం చేసుకోవాల్సిన అవసరం ఎందుకు వచ్చిందన్న ప్రశ్నకు గ్రెగ్ చాపెల్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు.'ఆయన జైలులోనే చనిపోతాడేమోనని మేం ఆందోళన చెందుతున్నాం. గత ఆరు నెలల్లోనే అంతర్జాతీయ క్రికెట్ కెప్టెన్ల నుంచి ఇలాంటి లేఖలు రెండుసార్లు వచ్చాయి. అయినప్పటికీ పరిస్థితుల్లో పెద్దగా మార్పు కనిపించడం లేదు. తాజాగా ఇమ్రాన్ కుమారులు, సోదరీమణులు కూడా ఆయన ఆరోగ్యం, జైలు పరిస్థితులపై బహిరంగంగా ఆందోళన వ్యక్తం చేస్తున్నారు' అని చాపెల్ పేర్కొన్నాడు. ఈ నేపథ్యంలో పాకిస్థాన్ సంబంధిత అధికారులతో నేరుగా మాట్లాడి ఇమ్రాన్ ఖాన్‌కు మెరుగైన వైద్యం, కుటుంబ సభ్యులను కలిసే అవకాశం, న్యాయ సహాయం వంటి కనీస సౌకర్యాలు అందేలా చూడాలని ఆస్ట్రేలియా ప్రభుత్వాన్ని ఏడుగురు మాజీ కెప్టెన్లు కోరారు.

టీమిండియాలో చోటు కోసం ఎదురుచూడటం లేదు: భువనేశ్వర్ కుమార్

ఇంటర్నెట్ డెస్క్: టీమిండియా సీనియర్ పేసర్ భువనేశ్వర్ కుమార్ భారత జట్టులోకి రీఎంట్రీ ఇవ్వాలనే ఆశాభావంతో ఉన్నాడు. ఐపీఎల్‌లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్టు వరుసగా రెండు టైటిళ్లు సాధించడంలో భువీ కీలక పాత్ర పోషించిన సంగతి తెలిసిందే. దీంతో అతడిని తిరిగి టీమిండియాలోకి తీసుకోవాలనే డిమాండ్లు మొదలయ్యాయి. ఈ క్రమంలో తన పునరాగమనంపై భువీ ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. తాను భారత్ తరఫున ఆడేందుకు సిద్ధంగా ఉన్నానని, అయితే జట్టులో చోటు కోసం గతంలో మాదిరి ఎదురుచూడటం లేదని స్పష్టం చేశాడు.'నేను ఏదో నిరూపించుకోవాలని క్రికెట్ ఆడటం లేదు. కానీ మళ్లీ భారత్ తరఫున ఆడే అవకాశం వస్తే చాలా సంతోషిస్తా. అలాగని గతంలో మాదిరి జట్టులో చోటు కోసం ఎదురుచూడటం లేదు. నేను ఎప్పుడో ఆ దశను దాటేశా. జట్టులో స్థానం కోల్పోయిన తర్వాత ఒకసారి నాకు ఓ ఫోన్ కాల్ వచ్చింది. కొన్ని సిరీస్‌ల వరకు నేను తిరిగి జట్టులోకి వస్తాననే అనుకున్నా. వాళ్లు చెప్పిన దాన్ని బట్టి చూస్తే.. తదుపరి రెండు సిరీస్‌లలో నాకు అవకాశం రావచ్చని భావించా. కానీ ఆ తర్వాత పరిస్థితి అలా లేదని అర్థమైంది. అయితే ఈ పరిణామం నన్ను పెద్దగా బాధించలేదు. అక్కడ ఏం జరుగుతుందో అర్థమైన తర్వాత పరిస్థితులను అంగీకరించడం మొదలుపెట్టా. ఆ దశ నా కెరీర్‌లోనే అత్యంత క్లిష్టమైనది. ఆ సమయంలో నా కుటుంబం ఎంతో అండగా నిలిచింది' అని భువీ వెల్లడించాడు.

2022లో చివరిసారిగా..

భువనేశ్వర్ కుమార్ చివరిసారిగా 2022 నవంబర్‌లో భారత్ తరఫున టీ20 మ్యాచ్ ఆడాడు. ఆస్ట్రేలియా వేదికగా జరిగిన టీ20 ప్రపంచకప్‌లో భారత్ సెమీఫైనల్లో ఓడిన అనంతరం న్యూజిలాండ్‌తో జరిగిన సిరీస్‌లో అతడు చివరిసారి జాతీయ జట్టు తరఫున బరిలోకి దిగాడు. మొత్తంగా భారత్ తరఫున మూడు ఫార్మాట్లలో కలిపి 229 మ్యాచ్‌లు ఆడిన భువనేశ్వర్ కుమార్.. 294 వికెట్లు పడగొట్టాడు. ఇందులో ఏడు సార్లు ఐదు వికెట్ల ప్రదర్శనలు ఉన్నాయి.

